Follow: @ANNTELUGU

ANN తెలుగు

15-05-2026

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 138 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




### కరీంనగర్ జ్యువెలరీ షాప్ చోరీ కేసు

# ముగ్గురు నిందితుల అరెస్టు..

## పరారీలో మరో 10 మంది

అజ్ఞాతంలో చోరీ కేసు మాస్టర్ మైండ్ సుబోధ్ సింగ్

2 నెలల క్రితమే 4 ప్రాంతాల్లో రెక్కీ

వివరాలు వెల్లడించిన సీపీ గౌస్ ఆలం

**కరీంనగర్, మహా :** రాష్ట్రంలో పెను సంచలనం రేపిన కరీంనగర్ జ్యువెలరీ షాప్ చోరీ ఘటనలో పోలీసులు కీలక వివరాలను వెల్లడించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు మరికొంతమంది నిందితుల కోసం గాలిస్తున్నారు. కరీంనగర్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీ గౌస్ ఆలం కేసు వివరాలను వెల్లడించారు. దొంగతనం కేసులో 2 నెలల క్రితమే నిందితులు..

మిగతా 3లో

**టాప్ న్యూస్**

### చైనాలో డొనాల్డ్ ట్రంప్ పర్యటన



- ఉద్రిక్తతల వేళ జిన్‌పింగ్‌తో కీలక చర్చలు

02

### మద్యం అమ్మకాలపై విజయ్ మరో సంచలనం



- సీఎంపై ప్రశంసలు

02

### నేడు వే 2 న్యూస్ కాంక్లేవ్



- సీఎంతో పాటు ప్రముఖులు

02



### కేరళం సీఎంగా వీడీ సతీశన్

- పది రోజుల సస్పెన్స్ కు తెర
- స్థానిక బలమున్న నేత వైపే హైకమాండ్

**కొచ్చి, మహా :** మే 4న కేరళం శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన దాదాపు 10 రోజుల తర్వాత కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి ఎవరన్న అంశంపై స్పష్టత ఇచ్చింది. అధిషటానం క్లియరెన్స్ ఇవ్వడంతో సతీశన్ కేరళం తదుపరి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. 140 స్థానాలున్న కేరళం అసెంబ్లీలో 102 స్థానాలు గెలుచుకున్న యూడీఎఫ్ కూటమికి సారథ్యం వహించిన ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టబోతున్నారు.

మిగతా 2లో



### ఢిల్లీ హైకోర్టు సంచలన నిర్ణయం

- అరవింద్ కేజ్రీవాల్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభం
- పరిమితి దాటిన వ్యాఖ్యలపై న్యాయస్థానం ఆగ్రహం
- కేజ్రీవాల్‌పై కఠినంగా వ్యవహరించిన ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం

03

# కీలక శాఖల్లో భారీ మార్పులు

## నెలాఖరులో విస్తరణ?

- శాఖల మార్పుపై ఇప్పటికే నేతలకు సంకేతాలు
- కేరళం ముగియడంతో.. ఇక విస్తరణమే అంటున్న కాంగ్రెస్ నేతలు
- నామినేటెడ్ పదవులపైనా చర్చలు
- ఐ & పిఆర్, ఇరిగేషన్, సినిమాతో పాటు పలు కీలకశాఖలపై చర్చలు



**నామినేటెడ్ పదవుల్లో ..**

(హైదరాబాద్ - మహా)

రాష్ట్రంలో ఇటీవల కాలంలో పదవులు ఒకదాని తర్వాత.. మరొకటి వస్తూనే ఉన్నాయి. కీలకమైన మంత్రివర్గ విస్తరణ, మార్పులు చేర్పుల పైనా చర్చ జరుగుతున్నది. అనేక కీలక శాఖల్లో మార్పులు ఖాయమన్న వార్తలు వినబడుతున్నాయి. ప్రతిసారీ ఏదో ఒక ముహూర్తం తెర మీదికి రావడం, ఆ టైం ముగిసిపోగానే... అయ్యయ్యో అని ఉసూరుమనడం ఎందుకు సర్వసాధారణమైపోయింది. శనివారం సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ వెళుతున్నారు. అయితే మే నెలాఖరులో విస్తరణ ఉండొచ్చని ఆశావహులు నమ్ముతున్నారు. కేరళం సీఎం ఎంపికను ప్రశాంతంగా ముగించగా, కార్యకర్తలు కోరుకున్న నేత వీడీ సతీషన్‌కు పగ్గాలు దక్కాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్ళు పూర్తి కాగా, మిగతా టైంలో పూర్తి భిన్నంగా పాలన సాగించేలా సీఎం వ్యూహం రచించినట్లు కనబడుతోంది. కేబినెట్‌కు సంబంధించి అనేకమంది ఆశావహులు ఉండగా, సామాజిక సమీకరణలను పరిగణనలోకి తీసుకుని భర్తీ చేసే అవకాశాలున్నాయి.

వచ్చే ఎన్నికల్లో ఆదిలాబాద్ లో అత్యధిక స్థానాలు గెలవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తుండగా, ఆదిలాబాద్ కు చెందిన కంది శ్రీనివాసరెడ్డి, దండెవిఠల్ తదితరులకు నామినేటెడ్ పదవులిచ్చి ప్రాధాన్యం పెంచే యోచనలో హైకమాండ్ ఉంది. నిజామాబాద్ జిల్లాలోనూ బాల్కొండ, ఆర్మూరు నేతలకు ప్రాధాన్యం దక్కే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. హైదరాబాద్ సిటీలో తాజాగా ముగ్గురు నేతలకు ఛైర్మన్ పదవులు దక్కగా, గతంలోనూ పలువురికి కీలక పదవులు దక్కాయి. ఇపుడు జీహెచ్ఎంసి, వచ్చే ఎన్నికలను పరిగణనలోకి తీసుకుని మళ్ళీ ప్రాధాన్యం ఇచ్చే సూచనలున్నాయి.

### ఎవరికి ఛాన్స్

ఐదారుగురు కీలక మంత్రుల శాఖల్లో మార్పులు తథ్యమని భావిస్తున్నారు. వివాదాస్పద మంత్రులు, నేతల వ్యవహారాలు పరిగణనలోకి తీసుకుని 2028లో పార్టీ గెలుపే లక్ష్యంగా కొత్త టీమ్ ను సీఎం సెట్ చేసుకునే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. బండి సంజయ్ తనయుడి ఎపిసోడ్ తో బిజెపి షాక్ కు గురికాగా, బిఆర్ఎస్ పార్టీ వ్యూహాలోపాలతో పట్టు సాధించడం లేదు. ముఖ్యమంత్రి రాజకీయ చతురతతో కాంగ్రెస్ ముందు వరుసలో ఉండగా, ఇదే పట్టును సాగించి 2023కు మించి సీట్లు సాధించాలని, 100సీట్లు లక్ష్యంగా ముందుకెళ్ళాలని కాంగ్రెస్ భావిస్తోంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, రామచంద్రనాయక్, ఆది శ్రీనివాస్, మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రేమ్ సాగర్ తదితర నేతలు మంత్రి పదవులు ఆశిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా ప్రాధాన్యశాఖల్లో మార్పులు చేర్పులు జరిగే అవకాశాలున్నాయి. సీఎం ఎవరివైపు మొగ్గుచూపుతారన్నది ఆసక్తికరంగా మారింది.

# ప్రత్యేకంగా బెయిల్ ఎందుకు అడుగుతున్నారు?

### బండి భగీరథ్ పిటిషన్ పై హైకోర్టు ప్రశ్నలు

ముందస్తు బెయిల్ పిటిషన్ పై విచారణ వాయిదా

భగీరథ్ తో తెలంగాణ మహిళాలోకానికి ప్రమాదం ఆర్ ఎస్పీ




**హైదరాబాద్, మహా :** పోక్సో కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణను తెలంగాణ హైకోర్టు వారం రోజులకు వాయిదా వేసింది. మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపడతామని పేర్కొంది . కాగా, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై హైదరాబాద్‌లోని పేట్ బషీర్‌బాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం భగీరథ్ హైకోర్టును ఆశ్రయించాడు. గురువారం హైకోర్టులో ఈ పిటిషన్‌పై విచారణ జరగగా.. భగీరథ్ తరుపున ప్రముఖ లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. పోక్సో కేసులోనూ పిటిషనర్‌కు కొన్ని హక్కులు ఉంటాయని, పోక్సో చట్టంలోని సెక్షన్ 11 పరిధిలోకి పిటిషనర్ రారని వాదించారు. బీఎన్ఎస్ సెక్షన్ 74, 75 కింద ఆరోపణలు రుజువు కాలేదని కోర్టుకు వివరించారు. బాధితురాలిగా పేర్కొంటున్న యువతి మైనర్ కాదని, ఆమె వయసు 19 20 ఏళ్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. బాధితురాలి తల్లి తప్పుడు రికార్డులతో వయసు తగ్గించి పోక్సో కేసు పెట్టించారని ఆరోపించారు.

మిగతా 2లో

# ఆ ఒక్కటీ.. అడక్కు

### అండర్ గ్రౌండ్‌లో బీజేపీ నేతలు

**మోదీ మైలేజ్ మిస్సయిందంటున్న నేతలు.. సర్కారు తీరుపైనా ప్రశ్నలు**



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాజకీయాల్లో బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు సంచలనంగా మారగా, తెలంగాణ బీజేపీ నేతలు అతలాకుతలం అవుతున్నారు. ఈ ఎపిసోడ్ ను ఎలా కౌంటర్ చేయాలో తెలియక తెలంగాణ బీజేపీలోని కీలక నేతలంతా అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోయారనే చర్చ జరుగుతోంది. ఈ సున్నితమైన అంశంపై ఎక్కడ స్పందించాల్సి వస్తుందో అన్న భయంతోనే నాయకులు అందుబాటులో ఉండటం లేదన్న చర్చ సాగుతోంది. ఆడపిల్ల సమస్య కావడం, మరోవైపు ఇంకా ఎపిసోడ్ ను లాగుతుండడంతో బండితో పాటు బిజెపికి డ్యామేజ్ అయింది.

మిగతా 2లో

# న్యాయవాదిగా దీదీ

సీఎం పదవి పోగానే లాయర్ అయిన మమతా బెనర్జీ

నల్లకోటు ధరించి కలకత్తా హైకోర్టులో కనిపించిన మాజీ సీఎం



**కోల్ కత్తా, మహా :** పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ గురువారం అందరినీ ఆశ్చర్యపరిచారు. తన ట్రేడ్ మార్క్ తెల్ల చీరను పక్కన పెట్టి, అడ్వకేట్ గౌన్ ధరించి కలకత్తా హైకోర్టులో ప్రత్యక్షమయ్యారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతర హింసకు సంబంధించి దాఖలైన ఒక కేసు విచారణ కోసం ఆమె స్వయంగా న్యాయవాది దుస్తుల్లో హాజరయ్యారు. ఒక ప్రజా నాయకురాలిగా కాకుండా, చట్టం తెలిసిన అడ్వకేట్‌గా ఆమె కోర్టు హాజరయ్యారు. మమతా బెనర్జీకి న్యాయవాద వృత్తితో పాత అనుబంధమే ఉంది.

మిగతా 2లో

# కేసీకి అందని సీఎం పీఠం

**ఎందరినో సీఎంలు, మంత్రులను చేసిన కింగ్ మేకర్**

**కాంగ్రెస్ ఏది నిర్ణయిస్తే అది శిరసావహిస్తానన్న వేణుగోపాల్**



**ఢిల్లీ, మహా :** కాంగ్రెస్ అధినాయకత్వానికి అత్యంత నమ్మకస్తుడు, జాతీయ రాజకీయాలను శాసించే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంలో ఆయనది కీలక పాత్ర. కాంగ్రెస్ హైకమాండ్ అంటే రాహుల్,ఖర్గే తరువాత వినిపించేది ఆయన పేరే. ఢిల్లీలో కూర్చుని దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ముఖ్యమంత్రుల పేర్లను ప్రకటించిన ఆయన తన సొంత రాష్టానికి మాత్రం సీఎం కాలేకపోయాడు. ఆయనే కేసీ వేణుగోపాల్. జాతీయ రాజకీయాల్లో కింగ్ మేకర్‌గా ఉంటూ.. సొంత రాష్ట్రానికి వచ్చేసరికి సీఎం పీఠానికి దూరయ్యారు. కర్ణాటక ఎన్నికల తర్వాత సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం పీఠం కోసం పెద్ద యుద్ధమే జరిగింది. అప్పుడు ఢిల్లీలో హైకమాండ్ తరఫున పంచాయితీ చేసి, ఇద్దరినీ ఒప్పించి సిద్ధరామయ్య పేరును సీఎంగా ప్రకటించింది ఈయనే. తెలంగాణలో కాంగ్రెస్ గెలిచినప్పుడు సీనియర్ల నుండి తీవ్ర పోటీ ఎదురైనా.. రేవంత్ రెడ్డి పేరును సీఎం అభ్యర్థిగా ఢిల్లీ నుండి అధికారికంగా ప్రకటించింది కేసీ వేణుగోపాలే. ఇలా దేశవ్యాప్తంగా ఎంతోమందిని సీఎం కుర్చీలో కూర్చొబెట్టిన కేసీ వేణుగోపాల్.. కేరళలో కాంగ్రెస్ గెలిచేసరికి మాత్రం ఆ కుర్చీపై కూర్చోలేక పోయారు.

మిగతా 2లో

# మోదీ సప్త సూత్రాలతోనే దేశ ఆర్థిక భద్రత




- ఆత్మనిర్భర్ భారత్ దిశగా జాతీయ ఆర్థిక ఉద్యమం
- దేశ స్వావలంబనలో ప్రజల భాగస్వామ్యమే కీలకం
- ఆర్థిక ముఖచిత్రం మారాలంటే ప్రజల మితవ్యయమే మార్గం
- బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నేతలు మేధోమథనం

వివరాలు 2లో

# ప్రత్యేకంగా బెయిల్ ఎందుకు అడుగుతున్నారు?

(మొదటిపేజీ తరువాయి)

ఆ యువతి పలు రకాల తేదీలతో డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్స్ తీసుకుందన్నారు. ఈనెల 8 న పేట్ బషీరాబాద్ పీఎస్‌లో నమోదైన ఫోక్సో కేసులో భగీరథ్‌పై తప్పుడు ఆరోపణలు చేశారని కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. తన క్లయింట్ నుంచి బాలిక ఫ్యామిలీ రూ.5 కోట్లు డిమాండ్ చేశారని పేర్కొన్నారు. బెదిరింపులకు పాల్పడమే కాకుండా, ఆ మొత్తాన్ని చెల్లించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బాధితురాలు బెదిరించారని వాదించారు. బాధితుల నుంచి వచ్చిన బెదిరింపులకు లొంగకుండా కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామన్నారు. ప్రముఖ రాజకీయ వ్యక్తి కుమారుడు కావడంతో ఈ కుట్రకు పాల్పడ్డారన్నారు. ఒకసారి ఎఫ్ఐఆర్ నమోదు చేసాక సెక్షన్లు మార్చడం అనుమానాలకు దారి తీస్తుందన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేశాక కావాలనే సెక్షన్లు మార్చారని, ఇది కుట్రపూరిత చర్యగా భావించాలని వాదించారు. బాధితురాలి స్టేట్మెంట్ రికార్డ్ చేశాక.. వాస్తవాలు తెలుసుకుని సెక్షన్లు మార్చడం జరిగిందని బాధితురాలి తరుపు లాయర్ కౌంటర్ ఇచ్చారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. బాధితురాలు పుట్టిన రోజు డేట్స్‌పై, గతంలో రాష్ డ్రైవింగ్ కేసులో అమ్మాయి మేజర్ అని పోలీసులు ఫైల్ చేసిన ఛార్జ్ షీట్ పట్ల పోలీసులు విచారణ జరపాలని హైకోర్టు ఆదేశించింది. వీటి ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. అయితే, ముందస్తు బెయిల్ వచ్చే వరకు అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఆదేశాలు ఇవ్వాలని భగీరథ్ తరుపు లాయర్ కోరగా మధ్యంతర బెయిల్‌పై శుక్రవారం విచారణ చేపడతామని హైకోర్టు స్పష్టం చేసింది.

### లాయర్లు సంయమనంతో వ్యవహరించాలి

బండి భగీరథ్‌ను క్రిమినల్ అని బాధితురాలి తరఫు న్యాయవాది సంబోధించడంతో పిటిషనర్ తరఫు లాయర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరువురి మధ్య వాగ్వాదంతో జడ్జి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నేరనిరూపణ అయ్యేంతవరకు నేరస్తుడు అనకూడదని హైకోర్టు పేర్కొంది. లాయర్లకు సంయమనం లేకపోతే పిటిషన్‌ను మరో బెంచ్‌కు మార్చుకోవచ్చని సూచించింది. ఇరువైపులా న్యాయవాదులు సంయమనంతో వ్యవహరించాలని ఆదేశించింది. పిటిషనర్‌కు అన్ని కేసుల్లా కాకుండా ప్రత్యేకంగా బెయిల్ ఎందుకు అడుగుతున్నారని విచారణ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది బదులిస్తూ బండి భగీరథ్ ఎలాంటి ప్రత్యేక హోదాలో బెయిల్ పిటిషన్ దాఖలు చేయలేదన్నారు. 1518 ఏళ్ల బాలిక బాధితురాలుగా ఉంటే బెయిల్ ఇవ్వొచ్చన్న తీర్పులు ఉన్నాయని వాదనలు వినిపించారు. గంటల తరబడి పిటిషనర్, బాధితురాలు ఫోన్లలో మాట్లాడుకున్నారని వివరించారు. మొదట ఎఫ్ఐఆర్‌లో నిందితుడిపై 7 ఏళ్ల కంటే తక్కువ శిక్ష పడే సెక్షన్లు నమోదు చేశారా? అని హైకోర్టు ప్రశ్నించింది. ఈనెల 8న బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హైకోర్టుకు పీపీ తెలిపారు. కేసు నమోదైన మరుసటి రోజు బాధితురాలి వాంగ్మూలం తర్వాత దర్యాప్తు అధికారి సెక్షన్లు మార్చారని వివరించారు. ఘటన జరిగిందని చెబుతున్న నాలుగున్నర నెలల తర్వాత పీఎస్‌లో ఫిర్యాదు చేశారని భగీరథ్ లాయర్ వాదనలు వినిపించారు.

### భగీరథ్ తో తెలంగాణ మహిళాలోకానికి ముప్పు; ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్

చట్టానికి వ్యతిరేకంగా బండి భగీరథ్ మామకు పోలీసులు నోటీసులు ఇచ్చారని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భగీరథ్‌కు నేర చరిత్ర ఉన్నదని.. తెలంగాణ మహిళా లోకానికి అతనితో ప్రమాదం పొంచి ఉన్నదని అన్నారు. భగీరథ్‌పై నమోదు అయిన పోక్సో కేసుపై పోలీసులు మీడియా సమావేశం ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. సీతక్క మీడియా సమావేశం ఏర్పాటు చేసి మహిళా లోకానికి తెలియజేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలి తల్లి తనతో మాట్లాడి ఆవేదనతో కొన్ని విషయాలు చెప్పుకున్నారని.. బాధితురాలి వ్యక్తిత్వాన్ని అడుగడుగునా నాశనం చేయాలని చూస్తున్నారని అన్నారు. ఆమెపై సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెడుతున్నారని.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రితో కొట్లాట చేస్తానని ఆమె తనతో చెప్పిందన్నారు. మంత్రులు సీతక్క, కొండ సురేఖ డీజీపీతో మాట్లాడి బాధితురాలి ఫొటోలను సోషల్ మీడియా నుంచి వెంటనే తీసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కల్వకుంట్ల కవిత పార్టీ పెట్టినప్పుడు తెలంగాణకు అమ్మలా ఉంటానని చెప్పి మర మనిషిగా ఉంటున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అమ్మలా ఉండాలని అనుకుంటున్న కవిత, బాధితురాలి తల్లి బాధ ఒకసారి చూడాలని సూచించారు. రేవంత్‌రెడ్డి, బీజేపీ స్క్రిప్ట్ చదవి మర మనిషిలా మారిపోయారన్నారు. బీఆర్ఎస్ నాయకుల వల్లే బాధితురాలి వివరాలు బయటకు వచ్చాయని కవిత అనడం సరికాదని సూచించారు. ఒక సీనియర్ పోలీస్ అధికారి సలహా వల్లే బండి భగీరథ్ కరీంనగర్‌లో బాధితురాలిపై కేసు పెట్టారని.. సంజయ్ పెంపకంలో తేడా ఉన్నదని అన్నారు. బాధితురాలిపై సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలకు రక్షణ లేదన్నారు.

# మద్యం అమ్మకాలపై విజయ్ మరో సంచలనం

## సీఎంపై ప్రశంసలు

**మహా:** తమిళనాడు నూతన ముఖ్యమంత్రి, టీవీకే చీఫ్ జోసెఫ్ విజయ్.. రాష్ట్రవ్యాప్తంగా ప్రార్థనా స్థలాలు, విద్యా సంస్థలు, బస్టాండ్లకు సమీపంలో ఉన్న 717 మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. తాజాగా, మద్యం అమ్మకాలపై మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో 21 ఏళ్లు దాటిన వాళ్లకే మద్యం విక్రయించాలనే నిబంధనను తీసుకొచ్చారు. యువత డ్రగ్స్, మద్యానికి బానిసలుగా మారుతున్న నేపథ్యంలో విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. డ్రగ్స్‌ను అరికడతామని ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. తాజాగా, ఆ హామీని ఆయన నిలబెట్టుకున్నారు.

# నేడు వే 2 న్యూస్ కాంక్లేవ్

## సీఎంతో పాటు ప్రముఖులు

**హైదరాబాద్, మహా:** ప్రముఖ మీడియాసంస్థ వే టు న్యూస్ కాంక్లేవ్ శుక్రవారం హైదరాబాద్ లో జరగబోతోంది. వే టు న్యూస్ కాంక్లేవ్ 2026 తెలంగాణ రాబోయే దశాబ్దం అన్న అంశంపై జరగబోయే ఈవెంట్ లో రాష్ట్ర భవిష్యత్తు విజన్ , అభివృద్ధి ప్రణాళికలపై చర్చించనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, కె.టి. రామారావు, జి. కిషన్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కల్వకుంట్ల కవిత, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డీజీపీ ఆనంద్ తో పాటు పలువురు పరిశ్రమ నిపుణులు పాల్గొననున్నారని యాజమాన్యం తెలిపింది.

# ఆ ఒక్కటీ.. అడక్కు

## అండర్ గ్రౌండ్‌లో బీజేపీ నేతలు

### మోదీ మైలేజ్ మిస్సయిందంటున్న నేతలు.. సర్కారు తీరుపైనా ప్రశ్నలు

(మొదటిపేజీ తరువాయి)

ఈ వ్యవహారంలో కేంద్రమంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ తప్పేమీలేదని, ఎంతో కష్టపడి ఆయన ఉన్నతస్థితికి చేరారని, అయితే తప్పుచేసిన వారిని సమర్థిస్తున్నారనే అభిప్రాయం, ఒక అత్యున్నత పదవిలో ఉండి.. అందుకు తగ్గ పరిణతితో నిర్ణయాలు జరగలేదన్న చర్చ ఆ పార్టీవర్గాలతో పాటు ప్రజలలో వినబడుతోంది. ఇక క్యాడర్ ఫీల్డ్ లో ఏం సమాధానం చెప్పాలని నేతలకు ఫోన్లు చేస్తుండడంతో, పార్టీ కార్యకర్తలు ఫోన్ చేసినా నేతలు స్పందించడం లేదు. క్యాడర్‌కు స్పష్టమైన దిశానిర్దేశం లేక గందరగోళం నెలకొందని తెలుస్తోంది. పలువురు సీనియర్ నాయకులు తమ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసుకుని మీడియాకు దూరంగా ఉంటున్నారు. చివరకు పార్టీ కార్యాలయంలో కూడా ముఖ్య నేతలు కనిపించడం లేదని, అత్యవసర సమావేశాలకు సైతం వారు హాజరు కాకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ప్రదాని మోదీ పర్యటన విజయవంతం కాగా, పరేడ్ గ్రౌండ్ జనంద్రమైంది. కానీ ఆ పర్యటన మైలేజీకి.. తాజా సంఘటన డ్యామేజీగా మారింద. ఈ కేసు ప్రభావం రాబోయే రాజకీయాలపై తీవ్రంగా పడుతుందని నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు, గత వారం రోజులుగా బండి భగీరథ్ పోలీసులకు చిక్కకుండా పరారీలోనే ఉన్నారు. అతడిని పట్టుకునేందుకు పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. ఇందులో భాగంగా రెండు పోలీస్ టీమ్స్ ఢిల్లీకి వెళ్లగా, మరో రెండు బృందాలు హైదరాబాద్‌లో, ఒక టీమ్ కరీంనగర్‌లో వెతుకుతున్నాయి. పోలీసులు నోటీసులు జారీ చేసినప్పటికీ భగీరథ్ విచారణకు హాజరు కాలేదు. మరోవైపు బెయిల్ పిటిషన్ పై గురువారం హైకోర్టులో వాదనలు జరిగాయి. అల్లు అర్జున్ తోపాటు అనేక కేసుల్లో కఠినంగా వ్యవహరించిన పోలీసులు, ఒక ఆడపిల్లకు అన్యాయం జరిగిన కేసులో వారం రోజులైనా నిందితుడిని గుర్తించలేకపోవడంపై సర్కారు సమాధానం చెప్పవలసివస్తున్నది. దీనిపై బిఆర్ఎస్ విమర్శలు చేస్తుండగా, బిజెపి స్పందించలేని పరిస్థితి నెలకొంది.

# కేసీకి అందని సీఎం పీఠం

(మొదటిపేజీ తరువాయి)

మే 4న కేరళ ఫలితాలు వచ్చి కాంగ్రెస్ కూటమికి 102 సీట్లు రాగానే, కేసీ వేణుగోపాల్ సీఎం కావడం ఖాయమనే ప్రచారం జరిగింది. కానీ వారం రోజులకు పైగా సాగిన హైడ్రామా తర్వాత సీన్ మారింది. గత ఐదేళ్లుగా ప్రతిపక్ష నేతగా ఉంటూ అసెంబ్లీలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వంపై పోరాడిన వీడీ సతీశన్‌కే కేరళలోని మెజారిటీ ఎమ్మెల్యేలు, మిత్రపక్షాలు జై కొట్టాయి. దీంతో హైకమాండ్ వీడీ సతీశన్‌నే సీఎంగా ప్రకటించింది.

### లోక్ సభ ఎంపీగా..

కేసీ వేణుగోపాల్ ప్రస్తుతం లోక్ సభ ఎంపీగా ఉన్నారు. అంతేకాకుండా ఏఐసీసీలో అత్యంత కీలకమైన పదవిలో ఉన్నారు. రాహుల్ గాంధీని కలవలంటే ముందుగా ఈయన పర్మిషన్ ఉండాలనేది కాంగ్రెస్ లో టాక్. ఎన్నో పంచాయతీలకు చక్కబెట్టే వేణుగోపాల్ ఒక రాష్టానికి పరిమితం అయితే జాతీయ స్థాయిలో పార్టీ సమన్వయం దెబ్బతింటుందని హైకమాండ్ భావించింది. ఇక కేసీ వేణుగోపాల్ 1996, 2001, 2006లో వరుసగా మూడుసార్లు అలప్పుజ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా, 2009, 2014, 2024లో అలప్పూజా నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యాడు. 2020లో రాజ్యసభగా ఎంపీగా ఎన్నికయ్యారు. ఉమెన్ చాందీ ప్రభుత్వంలో రాష్ట్రమంత్రిగా, మన్మోహన్ సింగ్ క్యాబినెట్‌లో కేంద్ర మంత్రిగా అవకాశం దక్కించుకున్నారు.

# కేరళం సీఎంగా వీడీ సతీశన్

## పది రోజుల సస్పెన్స్ కు తెర

### స్థానిక బలమున్న నేత వైపే హైకమాండ్




(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల ఫలితాలు వెలువడిన పది రోజుల వరకు ముఖ్యమంత్రి ఎవరనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ అధిష్ఠానం ముందు ముగ్గురు కీలక నేతలు వీడీ సతీశన్, కేసీ వేణుగోపాల్, రమేషన్ చెన్నితల రేసులో నిలిచారు. మెజారిటీ ఎమ్మెల్యేలు వేణుగోపాల్ వైపు మొగ్గు చూపినప్పటికీ క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్, సామాన్య ప్రజానీకం సతీశన్ వైపు నిలబడటంతో కాంగ్రెస్ ఆ పేరును ఎంపిక చేసింది. పార్టీ కార్యకర్తల నుంచి ఒత్తిడి, యూడీఎఫ్ మిత్ర పక్షాలైన ముస్లీం లీగ్ వంటి పార్టీల మద్దతుతో కాంగ్రెస్ హైకమాండ్ సతీశన్ వైపు మొగ్గు చూపింది.

### క్యాంపస్ రాజకీయాల నుంచి క్లిఫ్ హౌస్ వరకు

1964మే 31న ఎర్నాకులం జిల్లా నెట్టూరులో జన్మించిన సతీశన్, విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుగ్గా ఉండే వారు. మహాత్మా గాంధీ యూనివర్శిటీ యూనియన్ ఛైర్మన్‌గా పని చేసిన ఆయన తర్వాత నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా కార్యదర్శిగా ఎదిగారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన సతీశన్, సుమారు పదేళ్ల పాటు కేరళం హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 1996లో రాజకీయాల్లోకి వచ్చి పరవూరు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత నిరంతరం ప్రజల్లో ఉంటూ 2001లో అదే స్థానం నుంచి విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టారు. అప్పటి నుంచి నేటి వరకు పరవూరును అజేయమైన కోటగా మార్చుకున్నారు. 2026 ఎన్నికల ప్రచారంలో యూడీఎఫ్ వంద శాతానికిపైగా సీట్లు సాధిస్తుంది ఆయన ముందే చెప్పారు. కేరళంలో విజయం సాధించిన తర్వాత ముఖ్యమంత్రిగా ఎవరిని నియమించాలనే విషయంపై జాప్యం జరిగింది. పది రోజులుగా ఈవిషయాన్ని సాగదీయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. చివరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీతో పాటు ఇతర సీనియర్ పార్టీ నాయకులు హాజరైన ఒక ఉన్నత స్థాయి కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం పేరు ప్రకటించారు. 140 మంది సభ్యులున్న కేరళం అసెంబ్లీలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 102 సీట్లు గెలుచుకుని మెజారిటీ సాధించింది. అయినప్పటికీ, ముఖ్యమంత్రిని నిర్ణయించడంలో జరిగిన జాప్యంపై ప్రశ్నలు తలెత్తాయి. ముఖ్యమంత్రి పేరును ప్రకటించడంలో జాప్యం చేసినందుకు ప్రతిపక్షాలు కాంగ్రెస్ పార్టీని విమర్శించగా, పార్టీలో కూడా అసంతృప్తి స్పష్టంగా కనిపించింది. వయనాడ్‌లోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సమీపంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను విమర్శిస్తూ పోస్టర్లు వెలిశాయి. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేక సెంటిమెంట్ నెలకొని ఉన్నప్పటికీ, ఈ ఇద్దరు నాయకులు కేసీ వేణుగోపాల్‌ను కేరళం ముఖ్యమంత్రిని చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆ పోస్టర్లలో విమర్శలు చేశారు.

### సతీశన్ ఎంపికపై అసంతృప్తి లేదు: కేసీ వేణుగోపాల్

కేరళ సీఎంగా వీడీ సతీశన్ ఎంపికను స్వాగతిస్తున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. సతీశన్ ఎంపికపై ఎలాంటి అసంతృప్తి లేదని వెల్లడించారు. కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయాన్ని తాను గౌరవిస్తానని స్పష్టం చేశారు. సతీశన్ నాయకత్వంలో కేరళ ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తామని కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. "సతీశన్ ఎంపికపై ఎలాంటి అసంతృప్తి లేదు. నేను పూర్తిగా సంతృప్తిగా ఉన్నాను. అధిష్ఠానం నిర్ణయాన్ని శిరసావహిస్తాను. కాంగ్రెస్‌లో హైకమాండ్ నిర్ణయమే శిరోధార్యం. అన్నిరకాలుగా ఆలోచించే అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది" అని కేసీ వేణుగోపాల్ అన్నారు.

# మోదీ సప్త సూత్రాలతోనే దేశ ఆర్థిక భద్రత




**హైదరాబాద్, మహా:** దేశ ఆర్థిక స్వావలంబన, జాతీయ ప్రయోజనాలు మరియు భాగస్వామ్యమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు సూచించిన "సప్త సూత్రాలు సప్త పరివర్తన" అంశంపై గురువారం బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం, మీడియా సమావేశం ఘనంగా జరిగాయి. బీజేపీ రాష్ట్ర మీడియా టీమ్, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర పదాధికారులు, ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులు విశేషంగా పాల్గొన్నారు. దేశం అభివృద్ధి చెందుతున్న దశ నుంచి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక సవాళ్లను ముందుగానే దీటుగా ఎదుర్కోవాలని, అందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు.. ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు సూచించిన 10 ప్రధాన సూచనలతో కూడిన ప్రత్యేక పాంప్లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రభుత్వానిదే కాకుండా ప్రజల సామాజిక బాధ్యత కూడా ఎంతో ఉందన్నారు. దేశభక్తి అంటే కేవలం ప్రాణత్యాగం చేయడం మాత్రమే కాదని, జీవించి ఉండి దేశ ఆర్థిక భద్రతకు సేవ చేయడం కూడా గొప్ప దేశభక్తి అని ఆయన అభివర్ణించారు. "లోకల్ ఫర్ వోకల్" భావనతో స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా దేశీయ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవాలని కోరారు. ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని ఖర్చుల్లో మితవ్యయం పాటించాలని సూచించారు. ప్రధాని మోదీ సైతం తన కాన్వాయ్‌లో వాహనాలను తగ్గించుకుని దేశానికి ఆదర్శంగా నిలిచారని రాంచందర్ రావు గుర్తుచేశారు. సామాన్యులు కూడా అవసరమైనప్పుడు మాత్రమే వ్యక్తిగత వాహనాలను వినియోగించాలని, హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్న మెట్రో తదితర ప్రజా రవాణా వ్యవస్థలను వాడాలని విజ్ఞప్తి చేశారు. ఐటీ రంగంలో అమలవుతున్న కార్‌పూలింగ్, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఇంధన పొదుపుకు ఎంతో మేలు చేస్తాయన్నారు. గతంలో మన్మోహన్ సింగ్, ఇందిరా గాంధీ హయాంలో కూడా కఠిన పొదుపు చర్యలు చేపట్టారని గుర్తుచేసిన ఆయన, ఇప్పుడు ప్రధాని చేస్తున్న సూచనలను విమర్శించడం సరికాదన్నారు. తాను కూడా ఇటీవల ప్రజా రవాణాలోనే ప్రయాణించానని, విదేశాల్లోని ఉన్నతాధికారులు కూడా ఇదే పద్ధతిని పాటిస్తారని ఆయన ఉదహరించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ ఆర్థిక నిపుణులు ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణారెడ్డి "సప్త సూత్రాల"పై సమగ్ర విశ్లేషణ అందించారు. అంతర్జాతీయంగా దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు, విదేశీ మారక ద్రవ్య వినియోగాన్ని గణాంకాలతో సహా వివరించారు. ప్రధానమంత్రి సూచనలు కేవలం ప్రభుత్వ విధానాలు మాత్రమే కావని, అది ప్రజల భాగస్వామ్యంతో సాగాల్సిన జాతీయ ఆర్థిక ఉద్యమమని స్పష్టం చేశారు. స్వదేశీ ఉత్పత్తులు, ఇంధన పొదుపు, వంటనూనె నియంత్రణ, సహజ వ్యవసాయం వంటి దైనందిన జీవితంలో చేసే చిన్నచిన్న మార్పులు దేశ ఆర్థిక శక్తిని గణనీయంగా పెంచుతాయని ఆయన విశ్లేషించారు. ఇదే అంశంపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ ప్రత్యేకంగా మీడియాతో మాట్లాడుతూ సప్త సూత్రాల ఆవశ్యకతను అంకెలతో సహా వివరించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, గల్ఫ్ సంక్షోభం వంటి పరిణామాలు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని, అందుకే ముందు జాగ్రత్త చర్యగా (ప్రివెన్షన్ ఈజ్ బెటర్ ద్యాన్ క్యూర్) ప్రధాని ఈ సూచనలు చేశారని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో ఏటా 700 బిలియన్ డాలర్ల దిగుమతులు జరుగుతుండగా, ఎగుమతులు 400 బిలియన్ డాలర్లకే పరిమితం కావడంతో ఏకంగా 25 లక్షల కోట్ల రూపాయల (300 బిలియన్ డాలర్ల) భారీ ట్రేడ్ డెఫిసిట్ ఏర్పడుతోందని, ఇది కరెన్సీపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని అధిగమించేందుకు ఆయన సప్త సూత్రాల ప్రయోజనాలను ఇలా వివరించారు. దేశంలో ఏటా 800 టన్నుల బంగారం (సుమారు రూ.5.5 లక్షల కోట్ల నుంచి రూ.6 లక్షల కోట్లు) దిగుమతి అవుతోందని, ఇందులో 95 శాతం వ్యక్తిగత వినియోగానికే పోతోందని డాక్టర్ నర్సయ్య గౌడ్ తెలిపారు. భారతీయుల వద్ద అత్యధిక ప్రైవేట్ గోల్డ్ నిల్వలు ఉన్నందున, ఒక సంవత్సరం పాటు బంగారం కొనుగోళ్లను వాయిదా వేసుకుంటే ఐదారు లక్షల కోట్ల ఫారెక్స్ మిగులుతుందని, ఆ డబ్బును రియల్ ఎస్టేట్ లేదా మార్కెట్లలో పెట్టుబడి పెట్టాలని సూచించారు. అలాగే 11 లక్షల కోట్ల క్రూడ్ ఆయిల్ దిగుమతి భారాన్ని తగ్గించేందుకు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాడాలని, కేవలం 20 శాతం వాడకం తగ్గినా 3 నుంచి 4 లక్షల కోట్ల ఆదా అవుతుందన్నారు. కరోనా తరహాలో కనీసం 25 శాతం వర్క్ ఫ్రమ్ హోమ్ కొనసాగిస్తే 12 వేల కోట్ల విదేశీ కరెన్సీ మిగులుతుందని తెలిపారు. ఇక ఆరోగ్యపరంగా కూడా వంటనూనెల వినియోగాన్ని తగ్గించడం అత్యవసరమని ఒక వైద్యుడిగా ఆయన స్పష్టం చేశారు. ఫ్రైడ్ ఫుడ్స్ వల్ల ఊబకాయం, షుగర్ వంటి వ్యాధులు వస్తున్నాయని, ఏటా రూ. 1.6 2 లక్షల కోట్ల విలువైన వంటనూనెను దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో దీనిని 20 శాతం తగ్గించినా వేలాది కోట్ల విదేశీ ద్రవ్యం ఆదాతో పాటు ప్రజల ఆరోగ్య ఖర్చులు తగ్గుతాయన్నారు. వ్యవసాయంలో ఏటా 2 లక్షల కోట్ల ఎరువులు దిగుమతి చేసుకుంటున్నామని, కనీసం 20 శాతం ప్రకృతి వ్యవసాయం చేస్తే భూసారం పెరగడమే కాకుండా ఫారెక్స్ నిల్వలు పెరుగుతాయని వివరించారు. అండర్ గార్మెంట్స్ నుంచి లగ్జరీ కార్ల వరకు ప్రతి అంచెలో స్వదేశీ వస్తువులను కనీసం 25 శాతం వినియోగిస్తే సుమారు 2 లక్షల కోట్లు, విదేశీ టూర్ల స్థానంలో దేశీయ పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తే దాదాపు 2.8 లక్షల కోట్ల మేర సంపద దేశంలోనే ఉంటుందని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నట్లు దేశం ఏమీ క్లిష్ట పరిస్థితుల్లో లేదని బూర నర్సయ్య గౌడ్ కొట్టిపారేశారు. మన దగ్గర 60 నుంచి 70 రోజులకు సరిపడా ఆయిల్ నిల్వలతో పాటు 700 బిలియన్ డాలర్ల ఫారెక్స్ నిల్వలు పటిష్టంగా ఉన్నాయన్నారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా "యధా యధా హి శ్రేష్ఠ ఆచారేతి, తధా తధా జన అనువర్తేతే" అన్న మార్గంలో ప్రధాని మోదీ తానే ఆచరిస్తూ జాతికి మార్గనిర్దేశం చేస్తున్నారని, ఈ సప్త సూత్రాలను రాజకీయ కోణంలో కాకుండా జాతీయ ప్రయోజనాల దృష్టితో చూసి దేశాభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని బీజేపీ నేతలు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశారు.

# న్యాయవాదిగా దీదీ



(మొదటిపేజీ తరువాయి)

ఆమె 1982లో కోల్‌కతాలోని జోగేష్ చంద్ర చౌదరి లా కాలేజీ నుండి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. కలకత్తా హైకోర్టు బార్ అసోసియేషన్ డైరెక్టరీలో కూడా ఆమె పేరు నమోదై ఉంది. చట్టపరమైన నిబంధనల ప్రకారం, లా గ్రాడ్యుయేట్ అయిన ఎవరైనా ఒక క్లయింట్ తరపున వాదించేటప్పుడు మాత్రమే అడ్వకేట్ రోబ్ ధరించడానికి అనుమతి ఉంటుంది. ఈ క్రమంలోనే ఆమె ఒక న్యాయవాదిగా కోర్టుకు హాజరయ్యారు. ఈ పరిణామంపై సోషల్ మీడియాలో భిన్నమైన స్పందనలు వస్తున్నాయి. కొందరు నెటిజన్లు ఇది చాలా రిఫ్రెషింగ్ గా ఉందని, ఒక నాయకురాలు తన వృత్తిపరమైన నైపుణ్యాన్ని ఇలా ప్రదర్శించడం బాగుందని ప్రశంసిస్తున్నారు. అయితే, విమర్శకులు మాత్రం ఇది కేవలం పొలిటికల్ షో అని కొట్టిపారేస్తున్నారు. తృణమూల్ కాంగ్రెస్ మాత్రం ఈ విషయాన్ని గర్వంగా చెప్పుకుంటోంది. బెంగాల్ ప్రజల కోసం పోరాడే క్రమంలో మమతా బెనర్జీ వెనకడుగు వేయరని, సత్యాన్ని కాపాడటంలో ఆమెకున్న నిబద్ధతకు ఇది నిదర్శనమని పేర్కొంది. ఆమె వంటి నాయకురాలు మరొకరు లేరు అని ఎక్స్ వేదికగా పార్టీ ప్రశంసలు కురిపించింది. మొత్తానికి, మమత నల్లకోటు ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి.

# చైనాలో డొనాల్డ్ ట్రంప్ పర్యటన

## ఉద్రిక్తతల వేళ జిన్‌పింగ్‌తో కీలక చర్చలు



**మహా:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు రోజు రోజుకూ తీవ్ర స్థాయికి చేరుకుంటున్న తరుణంలో డొనాల్డ్ ట్రంప్ చైనా పర్యటన అంతర్జాతీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, ముఖ్యంగా ఇరాన్ వ్యవహారంలో కీలక పరిణామాల మధ్య ట్రంప్ ఈ పర్యటనను చేపట్టారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ఆయన నేడు, రేపు వరుసగా రెండు రోజుల పాటు అత్యంత కీలకమైన భౌగోళిక రాజకీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చలు జరపనున్నారు. ఈ చారిత్రాత్మక పర్యటనలో ట్రంప్ వెంట ప్రపంచ కుబేరుడు, టెస్లా సంస్థల అధినేత ఎలాన్ మస్క్ కూడా పాల్గొనడం వాణిజ్య, దౌత్య వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ట్రంప్ మధ్య జరిగే ఈ ఉన్నతస్థాయి సమావేశాల్లో ప్రధానంగా పశ్చిమాసియా సంక్షోభం, ఇరాన్ వ్యవహార శైలి గురించే చర్చలు సాగనున్నట్లు దౌత్య వర్గాలు వెల్లడించాయి. అంతర్జాతీయ వాణిజ్యానికి, ముడి చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిని వెంటనే తెరిచేలా ఇరాన్‌పై ఉమ్మడిగా ఒత్తిడి పెంచే వ్యూహాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా సమాలోచనలు చేయనున్నారు. ఇరాన్‌కు చైనాతో ఉన్న సత్సంబంధాలు, వాణిజ్య భాగస్వామ్యాల నేపథ్యంలో, జిన్‌పింగ్ ద్వారా ఇరాన్‌ను ఒప్పించే లేదా అంతర్జాతీయంగా ఒత్తిడి తెచ్చే ప్రయత్నంలో భాగంగానే ట్రంప్ ఈ పర్యటనకు రూపకల్పన చేసినట్లు స్పష్టమవుతోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టుగా నిలిచే సముద్ర మార్గాల్లో స్వేచ్ఛా వాణిజ్యాన్ని, నౌకాయాన భద్రతను పునరుద్ధరించడంపై అగ్రరాజ్యం ప్రధానంగా దృష్టి సారించింది. ఈ క్రమంలోనే వ్యాపార, సాంకేతిక దిగ్గజం ఎలాన్ మస్క్ సైతం ఈ ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందంలో ఉండటం విశేషం. మస్క్ ప్రత్యక్ష భాగస్వామ్యం కారణంగా భౌగోళిక రాజకీయ వ్యవహారాలతో పాటుగా కీలకమైన వాణిజ్య, సాంకేతిక అంశాలు కూడా ఈ రెండు రోజుల చర్చల్లో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అగ్రరాజ్యాల మధ్య జరిగే ఈ కీలక మంతనాలు పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు, గ్లోబల్ సప్లై చైన్ మరియు వాణిజ్య మార్గాల పునరుద్ధరణకు ఏ మేరకు దోహదపడతాయోనని యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా గమనిస్తోంది.

# ఢిల్లీ హైకోర్టు సంచలన నిర్ణయం

- అరవింద్ కేజ్రీవాల్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభం
- పరిమితి దాటిన వ్యాఖ్యలపై న్యాయస్థానం ఆగ్రహం
- కేజ్రీవాల్‌పై కఠినంగా వ్యవహరించిన ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం

**హైదరాబాద్, మహా:** ఢిల్లీ రాజకీయాల్లో మరోసారి పెను సంచలనం చోటుచేసుకుంది. న్యాయవ్యవస్థ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై ఢిల్లీ హైకోర్టు అత్యంత కఠినమైన నిర్ణయం తీసుకుంది. ఆయనపై కోర్టు ధిక్కరణ చర్యలను అధికారికంగా ప్రారంభిస్తూ ఉన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. గత కొంతకాలంగా న్యాయస్థానాల తీర్పులు మరియు న్యాయమూర్తుల పనితీరుపై కేజ్రీవాల్ చేసిన కొన్ని వ్యాఖ్యలు న్యాయవ్యవస్థ ప్రతిష్టను దిగజార్చేలా ఉన్నాయని భావించిన కోర్టు, ఈ విషయాన్ని సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టడం గమనార్హం. న్యాయమూర్తులు సురేష్ కుమార్ కైత్ మరియు మనోజ్ జైన్‌లతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై తీవ్రస్థాయిలో మండిపడటమే కాకుండా, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని అభిప్రాయపడింది. ఈ వివాదానికి ప్రధాన కారణం గతంలో జరిగిన కొన్ని విచారణల సందర్భంగా అరవింద్ కేజ్రీవాల్ సోషల్ మీడియా వేదికగా మరియు పత్రికా సమావేశాల్లో చేసిన వ్యాఖ్యలేనని సాక్షి దినపత్రిక తన కథనంలో విశ్లేషించింది. ముఖ్యంగా కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు, అరెస్టుల నేపథ్యంలో న్యాయస్థానాలు ఇచ్చే ఉత్తర్వులను రాజకీయ కోణంలో విమర్శించడంపై హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. న్యాయవ్యవస్థపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసేలా రాజకీయ నేతలు ప్రవర్తించడం సరికాదని, భావప్రకటన స్వేచ్ఛ పేరుతో కోర్టుల గౌరవానికి భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో భాగంగా కోర్టు ధిక్కరణ చట్టం 1971లోని నిబంధనల ప్రకారం కేజ్రీవాల్‌పై విచారణ జరపాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. న్యాయస్థానం ఈ విషయంలో కేవలం హెచ్చరికలతో సరిపెట్టకుండా, ఈ వ్యవహారాన్ని లోతుగా విచారించేందుకు సిద్ధమైంది. కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యల తాలూకు వీడియో క్లిప్పింగ్స్, లిఖితపూర్వక ఆధారాలను పరిశీలించిన తర్వాతే ఈ చర్యలకు పూనుకున్నట్లు సమాచారం. న్యాయమూర్తుల వ్యక్తిత్వాన్ని తప్పు పట్టడం లేదా తీర్పుల వెనుక ఇతర ఉద్దేశాలను ఆపాదించడం వంటివి న్యాయ పరిపాలనలో జోక్యం చేసుకోవడమేనని కోర్టు పేర్కొంది. ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల సమాజానికి తప్పుడు సంకేతాలు వెళ్తాయని, ఇది ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ నోటీసులపై తదుపరి విచారణ నాటికి కేజ్రీవాల్ తన వివరణను స్వయంగా లేదా న్యాయవాదుల ద్వారా సమర్పించాల్సి ఉంటుంది. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ (AAP) వర్గాలు ఈ పరిణామంపై స్పందిస్తూ, తాము న్యాయవ్యవస్థపై ఎప్పుడూ గౌరవం కలిగి ఉన్నామని, అయితే పౌరుల ప్రాథమిక హక్కుల గురించి మాట్లాడటం కోర్టు ధిక్కరణ కిందకు రాదని వాదిస్తున్నాయి. కానీ చట్టపరమైన నిపుణుల అభిప్రాయం ప్రకారం, కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభం కావడం అనేది అరవింద్ కేజ్రీవాల్‌కు వ్యక్తిగతంగా మరియు రాజకీయంగా పెద్ద ఎదురుదెబ్బగా పరిణమించవచ్చు. ఇప్పటికే అనేక అవినీతి ఆరోపణలు, విచారణలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్‌కు, ఇప్పుడు నేరుగా ఉన్నత న్యాయస్థానమే కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టడం ఆయన చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఒకవేళ విచారణలో ఆరోపణలు నిరూపితమైతే శిక్ష పడే అవకాశం కూడా లేకపోలేదు, ఇది ఢిల్లీ ప్రభుత్వ మనుగడపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ పరిణామం కేవలం ఢిల్లీకే పరిమితం కాకుండా జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగ సంస్థలను విమర్శించే ధోరణి పెరుగుతున్న తరుణంలో, ఢిల్లీ హైకోర్టు తీసుకున్న ఈ నిర్ణయం ఒక మైలురాయిగా నిలుస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని, అది అందరికీ సమానమని ఈ కేసు ద్వారా మరోసారి స్పష్టమైంది. భవిష్యత్తులో రాజకీయ నేతలు తమ ప్రసంగాల్లో న్యాయస్థానాల పట్ల ఎంత సంయమనం పాటించాలో ఈ ఘటన హెచ్చరికగా నిలుస్తోంది.

### కరీంనగర్ జ్యువెలరీ షాప్ చోరీ కేసు

# ముగ్గురు నిందితుల అరెస్టు

## పరారీలో మరో 10 మంది

అజ్ఞాతంలో చోరీ కేసు మాస్టర్ మైండ్ సుబోధ్ సింగ్

2 నెలల క్రితమే 4 ప్రాంతాల్లో రెక్కీ.. వివరాలు వెల్లడించిన సీపీ గౌస్ ఆలం

(మొదటిపేజీ తరువాయి)

4 ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారని తెలిపారు. ఈ దొంగతనంలో మొత్తం 13 మంది నిందితులు ఉన్నారని, 161 తులాల గోల్డ్, 112 క్యారెట్ల వజ్రాలు ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. నిందితుల నుంచి పిస్టల్స్, వెహికల్స్, భారీగా ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్‌లో చోరీ చేసిన తర్వాత ఆ నగలు తీసుకుని పశ్చిమ బెంగాల్‌కు దొంగలు పరారయ్యారని పేర్కొన్నారు. నిందితులను బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో బిహార్‌కు చెందిన 'ది గోల్డెన్ తీఫ్' సుబోధ్ సింగ్ మాస్టర్ మైండ్‌గా గుర్తించిన పోలీసులు.. అతడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ బంగారం చోరీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మొత్తం 13 మంది నిందితులు పాల్గొన్నట్లు కరీంనగర్ సీపీ గౌస్ ఆలం వెల్లడించారు. ఈ ఘటనలో ప్రత్యక్షంగా ఐదుగురు దొంగలు పాల్గొన్నారని, ఇప్పటివరకు ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గ్యాంగ్ లీడర్ సుబోధ్ సింగ్ సహా 10 మంది నిందితుల ఆచూకీ ఇంకా దొరకలేదని పేర్కొన్నారు. పీఎంజే జ్యువెలరీ షాప్‌లో దోపిడీకి ముందు నిందితులు ధర్మపురిలో ఆశ్రయం పొందినట్లు చెప్పారు. దొంగతనం తర్వాత వీరంతా 3 టీంలుగా విడిపోయి ధర్మపురి వద్ద తమ వాహనాలను వదిలేసి పారిపోయినట్లు తెలిపారు. అక్కడి నుంచి రైలు, బస్సు ద్వారా ఇతర రాష్ట్రాలకు వెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ ముగ్గురు నిందితుల నుంచి ఇప్పటి వరకు రూ.51 వేల నగదుతోపాటు.. 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీళ్లు దొంగిలించిన బంగారాన్ని కొనుగోలు చేసిన వ్యాపారితో పాటు నిందితులను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం పోలీస్ టీమ్‌లు గాలింపు ఆపరేషన్ కొనసాగిస్తున్నాయని తెలిపారు. ఈ దోపిడీ కేసులో ప్రధాన నిందితుడు సుబోధ్‌సింగ్ కాగా.. అత్యాధునిక టెక్నాలజీతో ఈ ముఠా అనేక దొంగతనాలకు పాల్పడుతోందని పేర్కొన్నారు. ఈ చోరీ చేయడానికి ముందు 2 నెలల క్రితమే 4 ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారని.. అన్నింటి తర్వాత చివరికి కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెల్లర్స్‌లో దోపిడీ చేశారని వెల్లడించారు. బిహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో సుబోధ్ సింగ్ ముఠా గతంలో చోరీలకు పాల్పడిందని.. కానీ మన రాష్ట్రంలో ఇలాంటి దోపిడీలు జరగడం ఇదే తొలిసారి అని సీపీ గౌష్ ఆలం తెలిపారు. పరారీలో ఉన్న నిందితులను కూడా త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.



## నిబంధనలు పాటిస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు

### జిల్లా కలెక్టర్, బల్దియా ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయ్

**మహా వరంగల్ బ్యూరో;** నిబంధనలు పాటిస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ను జారీ చేస్తామని హన్మకొండ జిల్లా కలెక్టర్, బల్దియా ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ కోసం ప్రత్యేకాధికారి గురువారం నగర పరిధి లోని దేశాయిపేట వెంకట్రామ జంక్షన్ హంటర్ రోడ్డు జే ఎస్ ఏం స్కూల్ ప్రాంతం, నయీమ్ నగర్ సురేంద్రపురి ప్రాంతాల్లో ప్రత్యక్షం గా పరిశీలించి అందజేసిన ధ్రువ పత్రాలతో పాటు కొలతలు వేసి పరిశీలించారు. ఈ సందర్భంగా బల్దియా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ భవన నిర్మాణ అనుమతులకు అవసరమైన ధ్రువపత్రాల సమర్పణ తో పాటు సూచించిన మార్గదర్శకాలను పాటిస్తేనే అనుమతుల తో పాటు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ను జారీ చేస్తామని తెలిపిన కలెక్టర్ అనుమతుల కోసం సమర్పించిన పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, టి పి ఎస్ అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

## రూ.10 వేల లంచం తీసుకుంటూ ఆర్ఐ పట్టివేత

### దుగ్గొండి తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఉదయం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఓ వారసత్వ భూమికి సంబంధించిన ఫైల్ పరిష్కారం కోసం రూ.10 వేల లంచం తీసుకుంటున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆర్ఐ ని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



**వివరాల్లోకి వెళితే..**

మండలంలోని మధిర గ్రామానికి చెందిన లొల్లాటి రాజు తన తండ్రి నర్సయ్య మరణంతో తన తండ్రి పేరు మీద ఉన్న 27 గుంటల వ్యవసాయ భూమి పట్టా చేసుకునేందుకు వారసత్వ భూమి నమోదు ప్రక్రియ కోసం దరఖాస్తు చేసుకోగా, సంబంధిత ఫైల్ ను ముందుకు జరిపేందుకు ఆర్ఐ రూ.10 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. చేసేదేమీ లేక బాధితుడు ఈ విషయాన్ని నేరుగా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు పక్కా ప్రణాళికతో దాడి నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలోనే లంచం తీసుకుంటున్న సమయంలో అధికారులు ఆర్ఐ ని అదుపులోకి తీసుకుని, నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించి, సంబంధిత పత్రాలను సీజ్ చేసినట్లు తెలిసింది. ఈ ఘటనతో ఒక్కసారిగా తహసీల్దార్ కార్యాలయంలో కలకలం రేగింది. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగితున్నట్లు తెలిసింది.

# అందుబాటులోకి టీజీ పర్యాటక మొబైల్ మ్యూజియం

### ప్రారంభించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**మహా వరంగల్ బ్యూరో;** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పర్యాటక మొబైల్ మ్యూజియాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం ప్రారంభించారు. హనుమకొండ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ మొబైల్ మ్యూజియం మూడు రోజుల పాటు ప్రజలకు అందుబాటులో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన ఛాయాచిత్రాలు, ప్రత్యేక ప్రదర్శనలు ఈ మ్యూజియంలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. పర్యాటక ప్రాంతాల విశేషాలు, సందర్శనకు సంబంధించిన సమాచారం, పర్యాటకులకు అవసరమైన బ్రోచర్లు, సమాచార పుస్తకాలను కూడా మ్యూజియంలో అందుబాటులో ఉంచారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, పర్యాటక రంగాన్ని మరింతగా ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ మొబైల్ మ్యూజియాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి ఎ. శ్రీనివాస్ కుమార్, ఎన్ఐసీ అధికారి శ్రీధర్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం.డి. అయూబ్ అలీ, టీజీవో అధ్యక్షుడు జగన్ మోహన్, రాజేష్, ప్రవీణ్ కుమార్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, సందర్శకులు తదితరులు పాల్గొన్నారు.



## బీసీ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే నాగరాజు
- ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన వి. హనుమంతరావుకు ఘన సత్కారం



**మహా వరంగల్ బ్యూరో;** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీసీ అభివృద్ధి , సంక్షేమ శాఖ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి. హనుమంతరావు ను గురువారం టీజీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ తో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్ నాగరాజు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ బీసీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. వి. హనుమంతరావు అనుభవం, ప్రజాసేవా దృక్పథం రాష్ట్రంలోని బీసీ వర్గాల సాధికారతకు మరింత దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ శివసేన రెడ్డి గారితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలి

- బాల కార్మిక నిర్మూలనపై శిక్షణా కార్యక్రమం
- వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద




**మహా వరంగల్ బ్యూరో;** బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ, కార్మిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం హన్మకొండ లోని అశోక్ హోటల్ సమావేశం మందిరంలో నిర్వహించిన బాల కార్మిక నిర్మూలన పై శిక్షణా కార్యక్రమం (వర్క్‌షాప్)లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థ పిల్లల భవిష్యత్తును దెబ్బతీసే సామాజిక సమస్య అని పేర్కొన్నారు. ప్రతి బాలుడు విద్యను అభ్యసించే హక్కు కలిగి ఉన్నాడని, బాల కార్మికత్వానికి బదులుగా విద్య, సంరక్షణ తో పాటు సురక్షిత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. బాల కార్మికులను గుర్తించడం, వారిని పాఠశాలల్లో చేర్పించడం, పునరావాసం కల్పించడం వంటి అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా గ్రామ పట్టణ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. వరంగల్ జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో బాల కార్మికుల గుర్తింపు, రక్షణ తో పాటు పునరావాస కార్యక్రమాలు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పిల్లల విద్య, వారి ఆరోగ్య భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, బాల కార్మికత్వాన్ని ఎక్కడైనా గమనించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారులు, పోలీస్ శాఖ ప్రతినిధులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు కోర్టు ఆవరణలో న్యాయ చైతన్య సదస్సు..

- మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టాలపై అవగాహన..
- పాల్గొన్న మెజిస్ట్రేట్ సూరి రెడ్డి..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల లీగల్ ఎయిడ్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం మణుగూరు కోర్ట్ ఆవరణలో న్యాయ చైతన్య సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల లీగల్ అథారిటీ చైర్మన్, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, వాణిజ్య దోపిడీ నిరోధక పథకం2015 కింద బాధితులకు అందే న్యాయ సహాయం, రక్షణ చర్యలు, ప్రభుత్వ పునరావాస అవకాశాలను వివరించారు. అలాగే జాగృతి పథకం2025లో భాగంగా సురక్షిత్ బచ్‌పన్ - సురక్షిత్ భవిష్య కార్యక్రమం ద్వారా చిన్నారుల రక్షణ, పోక్సో చట్టం నిబంధనలు, బాలల హక్కుల పరిరక్షణపై కక్షిదారులకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల లోపు బాలికలు తమ అంగీకారం ఉంది అని చెప్పినా కూడా నేరమే అవుతుందని ప్రత్యేకంగా పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతోపాటు బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరు విధిగా అనుసరించాలని, చట్టాలను దుర్వినియోగం చేయకూడదని సూచించారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది వీరంకి పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో పలువురు న్యాయవాదులు వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి సూచనలు అందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురు కృష్ణ, న్యాయవాదులు కందిమల్ల నరసింహారావు, జాడి చొక్కారావు, కుర్మ విజయ్, మేదరమెట్ల శ్రీనివాసరావు, రామ్మోహన్ రావు, ఈర్ల రాము, పోశం భాస్కర్, బిక్కసాని శ్రీనివాస్, బొంతు సునీత, తాటి వందన, వాసవి, లీగల్ సెల్ కోఆర్డినేటర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. సదస్సు ముగింపులో ప్రజలు తమ హక్కుల పరిరక్షణకు చట్టాలను తెలుసుకుని అవసరమైనప్పుడు లీగల్ ఎయిడ్ సేవలను వినియోగించుకోవాలని లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పద్మావతి సూచించారు.

## ఘనంగా చిల్డ్రన్ బైబిల్ క్లబ్ సీబీసీ 2026 వేడుకలు

### ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నాయకులు జన్ను శ్యామ్




**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ తూర్పు నియోజకవర్గం 25వ డివిజన్ పరిధిలోని సెంటినరీ ట్రినిటీ బాప్టిస్ట్ చర్చి వద్ద మండిబజార్ మట్టేవాడ లో చిల్డ్రన్ బైబిల్ క్లబ్ సీబీసీ 2026 వేడుకల్లో 300 మంది పిల్లలు పాల్గొన్నారు. 1 05 2026 నుండి చిల్డ్రన్ బైబిల్ క్లబ్ వేడుకల్లో పది రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. 13 5 2026 తేదీన చిల్డ్రన్ బైబిల్ ప్రోగ్రామ్ ను వెలడిక్టరి ముగింపు వేడుకలు గురువారం సెంటినరీ ట్రినిటీ బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా నిర్వహించారు. దైవజనులు సంఘ కాపరి రెవ. డాక్టర్ బి వినయ్ కుమార్ ,రెవ. డా: పగడాల ప్రేమ్ కుమార్ ,చిన్నపిల్లలను ఉద్దేశించి వాక్య సందేశం అందించారు. పిల్లలకు క్రీడా కార్యక్రమాలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. ఇందులో భాగంగా మ్యూజికల్ చైర్స్ లో విజేతలకు సండే స్కూల్ చిన్నపిల్లల తో పాటు టీచర్స్ కు అరుణ, జన్ను లత కు 25వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు జన్ను శ్యామ్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రెసిడెంట్ పి ఆర్ విజయ్ కుమార్, సెక్రెటరీ జై జై. విల్సన్,ట్రెజరర్ జే ఎన్. శ్రీనివాస్ ,జాయింట్ సెక్రెటరీ జన్ను కరుణాకర్, సండే స్కూల్ సూపర్డెంట్ జన్ను ఎలిషా రవి సండే స్కూల్ డైరెక్టర్ జన్ను రవళి తేజ, మరియు జన్ను సుమిమోన్ పాల్, జన్ను అనిల్, జన్ను రమేష్ స్థానిక సంఘ పెద్దల తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# భూకబ్జాదారుల నుంచి పార్కు స్థలాన్ని కాపాడాలి

### కమీషనర్ కు కాలనీవాసుల విజ్ఞప్తి




**మహా వరంగల్ బ్యూరో ;** హనుమకొండ నగరంలోని 49, 50 డివిజన్‌ల పరిధిలో ఉన్న విద్యుత్ నగర్ కాలనీలో సుమారు 2000 గజాల పార్కు స్థలాన్ని కొందరు భూకబ్జాదారులు గురువారం జేసీబీల సహాయంతో చదును చేసి ఆక్రమించడానికి ప్రయత్నించిన ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. కాలనీవాసుల సమాచారం ప్రకారం పార్కు స్థలంగా కేటాయించిన డిపి నెంబర్ 970/1, 970 బై ఏ తేదీ 12 8 1992 కుడా లేఅవుట్ అనుమతి ఇచ్చింది. ఈ స్థలం పై కొంతకాలంగా కన్నేసిన కబ్జాదారులు అకస్మాత్తుగా జేసీబీ యంత్రాలతో ప్రవేశించి భూమిని చదును చేయడం ప్రారంభించారు. ఈ విషయం పై స్థానికులు ప్రశ్నించగా ఈ స్థలం మాదే, మాకు సంబంధిత పత్రాలు ఉన్నాయి" అంటూ దురుసుగా ప్రవర్తించి దౌర్జన్యంగా వ్యవహరిస్తూ ఆక్రమణకు పాల్పడినట్లు కాలనీ అధ్యక్షులు రామ్ రెడ్డి ఆరోపిస్తున్నారు. గతంలో గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈ స్థలానికి రక్షణగా ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టేందుకు గుంతలు తవ్వి పనులను మధ్యలోనే నిలిపివేయడంతో స్థలం కబ్జా కు గురైందని స్థానికులు వాపోతున్నారు. అదే అదనుగా భావించిన భూకబ్జాదారులు ఇప్పుడు పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సుబే దారి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని భూకబ్జాదారులను అక్కడి నుండి వెళ్లగొట్టారు. ఈ స్థలం పై ఇరు వర్గాల దస్త్రాలు చూపించాలని, అప్పటి వరకు ఇక్కడ ఎవరు ఉండకూడదని ఇది పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోని భూమి అని పోలీసులు ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులను ఘటన స్థలం నుండి పంపించారు. విద్యుత్ నగర్ కాలనీలో పిల్లలు, వృద్ధులు, మహిళలకు ఉపయోగపడే ఏకైక పార్కు స్థలాన్ని కాపాడాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వెంటనే గ్రేటర్ హనుమకొండ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, అధికారులు స్పందించి ఆక్రమణ ప్రయత్నాలను అడ్డుకోవాలని, పార్కు స్థలానికి పూర్తి స్థాయిలో ప్రహరీ గోడ నిర్మించాలని, హరిత హారం కింద మొక్కలు నాటి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అభివృద్ధి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

### మణుగూరు ఆర్టీసీ లాజిస్టిక్స్ లో..

# క్లెయిమ్ చేయని పార్సిళ్ల వేలం..

### మణుగూరు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్యాం సుందర్..

**మణుగూరు మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్‌లో డెలివరీ కాకుండా మిగిలిపోయి క్లెయిమ్ చేయని పార్సిళ్లను వేలం వేయడానికి టిజి ఆర్టిసి అధికారులు సిద్ధమయ్యారు. ఈ నెల 18వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు మణుగూరు డిపో ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ శ్యాంసుందర్ గురువారం లో ప్రకటనలో తెలిపారు. డెలివరీ కోసం పంపినప్పటికీ స్వీకరించని లేదా యజమానులు సంప్రదించని వస్తువులను నిబంధనల ప్రకారం వేలం ద్వారా విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యక్తులు వేలంలో పాల్గొని అవకాశం వినియోగించుకోవాలని సూచించారు.



వేలానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం 9154298586, 9154298582 సెల్ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

# తాళ్లూరి పంచాక్షరయ్యను కలిసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**బూర్గంపహాడ్ మహా :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరవెండిలోని ఆయన స్వగృహానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. రాజకీయాల్లో 4 దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భద్రాచలం రామయ్య దర్శనానికి వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాములవారి దర్శనం అనంతరం ఇరవెండి చేరుకొని పంచాక్షరయ్యను కలిశారు. తన నివాసానికి వచ్చిన తుమ్మలను సాదరంగా ఆహ్వానించిన పంచాక్షరయ్య శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరావు పంచాక్షరయ్యతో కొద్దిసేపు మాట్లాడారు. స్థానిక పరిస్థితులపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరుపల్లి వంశీకృష్ణ, బూర్గంపాడు పిఎసిఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, తాళ్లూరి రాధాకృష్ణ, తాళ్లూరి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ నేపథ్యంలో మణుగూరులో శాంతి సమావేశం..

- ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి..
- మణుగూరు డిఎస్పి, కమిషనర్ లు..

**మణుగూరు, మహా :** బక్రీద్ పండుగ నేపథ్యంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మణుగూరు డిఎస్పి కార్యాలయంలో గురువారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మణుగూరు సబ్ డివిజన్ పరిధిలోని అధికారులు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ముస్లిం సోదరులు, హిందూ సోదరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, కమిషనర్ ప్రసాద్ లు మాట్లాడుతూ మణుగూరులో ఇప్పటివరకు అన్ని పండుగలను ప్రజలు కలిసిమెలిసి ప్రశాంతంగా జరుపుకుంటున్నారని, అదే విధంగా బక్రీద్ పండుగను కూడా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. సామరస్య వాతావరణాన్ని కాపాడుతూ పరస్పర సహకారంతో పండుగ జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో సిఐలు నాగబాబు, వెంకటేశ్వర్లు, అశోక్ రెడ్డి, ఎస్ఐ నగేష్ కుమార్, వెటర్నరీ వైద్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అపోహలకు లోనుకాకుండా పరస్పర గౌరవ భావంతో పండుగను విజయవంతంగా నిర్వహించుకోవాలని అధికారులు ప్రజలను కోరారు.



# మోదీ పిలుపుతో కదిలిన కార్పొరేట్ రంగం

ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం, అంతర్జాతీయంగా కమ్ముకొస్తున్న ఆర్థిక అనిశ్చితిని దీటుగా ఎదుర్కొని భారత ఆర్థిక వ్యవస్థను కాపాడుకునేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ఇచ్చిన "సప్త సూత్రాలు" (ఏడు సూత్రాలు) పిలుపునకు కార్పొరేట్ రంగం నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. దేశ ఆర్థిక స్వావలంబన, విదేశీ మారక ద్రవ్య ఆదా కోసం ప్రజలు, వ్యాపార వర్గాలు తమ దైనందిన వ్యవహారాల్లో మితవ్యయం పాటించాలని ప్రధాని చేసిన విజ్ఞప్తిని దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్పీజీ గ్రూప్ చైర్మన్ హర్ష్ గోయెంకా తక్షణమే అమలు చేస్తూ ఇతర కార్పొరేట్ సంస్థలకు ఆదర్శంగా నిలిచారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రధాని చేసిన ఈ అద్భుతమైన సూచనలను తమ సంస్థలో తూచా తప్పకుండా అమలు చేయాలని నిర్ణయించిన గోయెంకా, గురువారం తమ సంస్థల ఉద్యోగులు, యాజమాన్య బృందాలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. షోకులకు, అనవసర ఖర్చులకు స్వస్తి పలికి బాధ్యతాయుతమైన మితవ్యయం దిశగా అడుగులు వేయాలని ఆయన తన అంతర్గత సందేశంలో స్పష్టం చేశారు.




హర్ష్ గోయెంకా జారీ చేసిన ఆదేశాల్లో ప్రధానంగా "వర్క్ ఫ్రమ్ హోమ్" విధానాన్ని తిరిగి పెద్ద ఎత్తున ప్రోత్సహించడం అత్యంత కీలకమైన అంశం. కోవిడ్ సమయంలో విజయవంతమైన ఈ విధానాన్ని, ఎవరి ఉద్యోగ బాధ్యతలు అయితే ఇంటి నుంచి చేయడానికి వీలుంటుందో వారందరికీ వర్తింపజేయాలని ఆయన ఆదేశించారు. తద్వారా ఉద్యోగుల ప్రయాణాలు తగ్గి, దేశవ్యాప్తంగా ఇంధన వినియోగం భారీగా ఆదా అవుతుందని ఆయన భావించారు. అలాగే విదేశీ ప్రయాణాలను తక్షణమే కనీస స్థాయికి కుదించాలని, అత్యవసరమైతే తప్ప విదేశీ పర్యటనలు చేయకూడదని ఆదేశించారు. దేశీయ విమాన ప్రయాణాలను కూడా గణనీయంగా తగ్గించుకోవాలని, ఒక నగరం నుంచి మరో నగరానికి వెళ్లి చేసే సమావేశాలను రద్దు చేసుకుని, వాటి స్థానంలో వర్చువల్ ఆన్‌లైన్ సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లను మాత్రమే వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఆర్పీజీ గ్రూప్ కొనుగోలు చేసే లేదా అద్దెకు తీసుకునే ప్రతి కారు తప్పనిసరిగా ఎలక్ట్రిక్ లేదా హైబ్రిడ్ వాహనమే అయి ఉండాలని మరో అద్భుతమైన పర్యావరణ హిత నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగులు ఆఫీసులకు వచ్చేందుకు వ్యక్తిగత వాహనాల కంటే పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, బస్సులు, మెట్రో రైళ్లు వాడాలని, లేదా కార్‌పూలింగ్ విధానాన్ని అనుసరించాలని గోయెంకా తన లేఖలో విజ్ఞప్తి చేశారు. అంతర్గత సమీక్షలు, ఇంటర్వ్యూలు అన్నీ ఆన్‌లైన్‌లోనే జరగాలని, ఇది కేవలం ప్రభుత్వ ఎజెండాకు మద్దతు ఇవ్వడమే కాకుండా సంస్థలో బాధ్యతాయుతమైన సంస్కృతిని పెంపొందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ మే 10న హైదరాబాద్‌లో, మే 11న గుజరాత్‌లోని వడోదరలో చేసిన ప్రసంగాల్లో దేశ ప్రజల ముందు ఉంచిన ఈ సప్త సూత్రాలకు బలమైన ఆర్థిక, గణాంక నేపథ్యం ఉంది. అంతర్జాతీయంగా చూస్తే 2026 జనవరి నాటికి భారతదేశ వాణిజ్య లోటు (ట్రేడ్ డెఫిసిట్) ఏకంగా 34.68 బిలియన్ డాలర్లకు చేరుకుని సరికొత్త గరిష్టాన్ని తాకింది. దీనికి ప్రధాన కారణం దేశంలోకి విపరీతంగా వస్తున్న దిగుమతులే. భారతదేశం ఏటా సుమారు 174.9 బిలియన్ డాలర్లను కేవలం ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల కోసమే ఖర్చు చేస్తోంది. ఇది మన మొత్తం దిగుమతుల్లో 22 శాతానికి పైగా ఉంటుంది. అందుకే పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, ఈవీ వాహనాలు వాడాలని ప్రధాని కోరారు. ఇక భారతదేశం ప్రపంచంలోనే అత్యధికంగా బంగారం దిగుమతి చేసుకునే దేశాల్లో ఒకటి. ఏటా సుమారు 800 టన్నుల బంగారం దిగుమతి అవుతోంది. దీని విలువ దాదాపు రూ. 5.5 లక్షల కోట్ల నుంచి రూ. 6 లక్షల కోట్ల వరకు ఉంటుంది. ఇందులో 95 శాతం కేవలం వ్యక్తిగత వినియోగానికే పోతోంది. కేవలం ఒక సంవత్సరం పాటు ప్రజలు అత్యవసరం కాని బంగారం కొనుగోళ్లను వాయిదా వేసుకుంటే దేశానికి ఐదారు లక్షల కోట్ల విలువైన ఫారెక్స్ (విదేశీ మారక ద్రవ్యం) మిగులుతుంది. ఈ నిధులతో దేశం ఆర్థికంగా మరింత బలోపేతం అవుతుంది.

వీటితో పాటు వంటనూనెల దిగుమతి భారాన్ని తగ్గించుకోవడానికి, ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి వంట నూనె వాడకాన్ని తగ్గించాలని ప్రధాని సూచించారు. గల్ఫ్ ప్రాంతంలో యుద్ధం కారణంగా రసాయన ఎరువుల (ముఖ్యంగా యూరియా) ధరలు ఒక్కసారిగా టన్నుకు 516 డాలర్ల నుంచి 680 డాలర్లకు పైగా పెరిగిపోయాయి. దీన్ని తట్టుకునేందుకు రైతులు కనీసం 50 శాతం రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విదేశీ పర్యటనలు, డెస్టినేషన్ వెడ్డింగ్స్ మానివేసి దేశీయ పర్యాటకానికి ప్రాధాన్యం ఇవ్వాలని, స్థానిక ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని మోదీ సూచించారు. దేశం ఒక క్లిష్టమైన భౌగోళికరాజకీయ పరిస్థితులను ఎదుర్కొంటున్న వేళ, ప్రధాని చేసిన ఈ అభ్యర్థన సామాన్య ప్రజల నుంచి హర్ష్ గోయెంకా లాంటి బడా కార్పొరేట్ అధినేతల వరకు అందరినీ కదిలించింది. నాస్కామ్ అనుబంధ ఐటీ ఉద్యోగ సంఘం 'నైట్స్' కూడా ప్రధాని పిలుపునకు మద్దతుగా ఐటీ రంగం మొత్తంలో వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని ఒక జాతీయ బాధ్యతగా అమలు చేయాలని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖను కోరడం విశేషం. ఒక నాయకుడి ముందుచూపు, దానికి పౌరుల కార్యాచరణ తోడైతే ఎలాంటి ఆర్థిక సవాళ్లనైనా దేశం సునాయాసంగా ఎదుర్కోగలదనడానికి కార్పొరేట్ రంగం తీసుకుంటున్న ఈ నిర్ణయాలే ప్రత్యక్ష ఉదాహరణ.

- గడల నరసింహారావు,
సీనియర్ జర్నలిస్ట్

# వేసవి దుక్కి...

## భూమికి బలం రైతుకు లాభం



పంట కోత అనంతరం భూమిని లోతుగా దున్నే "వేసవి దుక్కులు" పద్ధతి రైతులకు దీర్ఘకాలిక లాభాలను అందించే కీలక వ్యవసాయ యాజమాన్య చర్యగా వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. వేసవి ఎండలో భూమిని దున్నడం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, చీడపీడల నివారణ, నీటి నిల్వ, పెట్టుబడి తగ్గుదల, దిగుబడి పెరుగుదల వంటి అనేకప్రయోజనాలు కలుగుతాయి. వేసవి దుక్కులను కేవలం ఒక వ్యవసాయ పనిగా కాకుండా, భూమి ఆరోగ్యాన్ని కాపాడే దీర్ఘకాలిక పెట్టుబడిగాభావించాలి. ఈ పద్ధతిని పాటించడం ద్వారా భూసారం పెరగడంతో పాటు సాగు ఖర్చు తగ్గి, లాభసాటి వ్యవసాయం సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు.

**ఇవీ ప్రయోజనాలు**

- ✔ నేల గుల్లబారి వేర్ల పెరుగుదలకు అనుకూల పరిస్థితులు
- ✔ కలుపు మొక్కలు, పురుగుల గుడ్లు, లార్వాల సహజ నియంత్రణ
- ✔ నేలలో సేంద్రియ కర్బనం మరియు మిత్ర సూక్ష్మజీవుల పెరుగుదల
- ✔ వర్షపు నీటి నిల్వ సామర్థ్యం మెరుగుదల
- ✔ సాగు ఖర్చులో తగ్గుదల అవకాశం
- ✔ పంట దిగుబడిలో పెరుగుదల సాధ్యం

వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపిన వివరాల ప్రకారం వేసవి దుక్కుల వల్ల నేల గట్టిపడిన పొరలు పగిలి గాలి ప్రసరణ మెరుగుపడుతుంది. భూమిలోని పోషకాలు సమానంగా కలవడంతో మొక్కల వేర్లు లోతుగా పెరిగి పోషకాలను సమర్థవంతంగా గ్రహిస్తాయి. వేసవి ఎండ తీవ్రత కారణంగా నేలలో దాగి ఉండే హానికర పురుగుల గుడ్లు, లార్వాలు, కోశస్థ దశలు బయటకు వచ్చి ఎండకు నశిస్తాయి. పక్షులు వాటిని ఆహారంగా తీసుకోవడం వల్ల సహజ నియంత్రణ జరుగుతుంది. దీంతో పురుగుమందుల వినియోగంగణనీయంగా తగ్గుతుంది. అలాగే ఎండు తెగుళ్లు, వేరు కుళ్లు వంటి వ్యాధులకు కారణమయ్యే శిలీంధ్ర బీజాలు అధిక ఉష్ణోగ్రతల వల్ల నశించి పంట కాలంలో వ్యాధుల తీవ్రత తగ్గుతుంది. వ్యవసాయ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం చీడపీడలప్రభావం కూడా తగ్గే అవకాశం ఉంది. వేసవి దుక్కుల వల్ల భూమిలోని పంట అవశేషాలు, ఎండు గడ్డి తదితరాలు మట్టిలో కలిసిపోయి క్రమంగా సేంద్రియ కర్బన పదార్థంగ మారతాయి. దీనివల్ల నేలలో సేంద్రియ కర్బనం పెరిగి భూసారం మెరుగుపడుతుంది. మిత్ర సూక్ష్మజీవుల వృద్ధికి కూడా ఇది అనుకూల పరిస్థితులు కల్పిస్తుంది. వేసవి దుక్కుల వల్ల భూమిలో గాలి ప్రసరణ, తేమ నిల్వ, సేంద్రియ పదార్థాల కలయిక మెరుగుపడటంతో వానపాములకు అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. దీంతో వానపాముల సంతతి పెరిగి నేల మరింత గుల్లగా మారుతుంది. వానపాములు భూమిలో సహజంగా సొరంగాలు తయారు చేయడం వల్ల నీరు, గాలి సులభంగా లోనికి చేరి భూసారం పెరగడానికి సహాయపడుతుంది. నీటి యాజమాన్యంలో కూడా వేసవి దుక్కులు కీలక పాత్ర పోషిస్తాయి. దుక్కి చేసిన భూమి గుల్ల బారడం వలన తొలి వర్షపు నీటిని భూమిలోకి ఇంకించుకుంటుంది. దీనివల్ల భూమిలో తేమ ఎక్కువకాలం నిల్వ ఉండి వర్షాభావ పరిస్థితుల్లో కూడా పంట నిలబడే అవకాశాలు పెరుగుతాయి. ఆర్థికంగా కూడా ఈ పద్ధతి రైతులకు మేలు చేస్తుంది. కలుపు నివారణ, పురుగు మందుల ఖర్చులు తగ్గడం వల్ల రైతులకు ఖర్చు ఆదా అవుతుంది. అదనంగా దిగుబడి పెరగడం ద్వారా మరింత ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.

**రైతులకు సూచనలు:**

- ✔ పంట కోత పూర్తయిన వెంటనే భూమిలో స్వల్ప తేమఉన్నప్పుడు దుక్కులు చేయాలి
- ✔ భూమిని లోతుగా దున్నడం ఉత్తమం
- ✔ వీలైతే భూమిని ఏటవాలుగా దున్నడం ద్వారా వర్షపు నీరు
- ✔ భూమిలోకి ఎక్కువగా ఇంకుతుంది
- ✔ దుక్కుల అనంతరం పంట అవశేషాలను భూమిలో కలపడం ద్వారాసేంద్రియ కర్బనం పెరుగుతుంది

- వ్యవసాయ శాఖ, తెలంగాణ

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999

# విజయానికి కేవలం ప్రతిభ ఉంటే సరిపోదు..

## అమెరికన్ ఫుట్‌బాల్ దిగ్గజం టోనీ డోర్సెట్



జీవితం ఎప్పుడూ ఒకేలా సాగదు. ఒడిదుడుకులు ఎదురైనప్పుడు చాలామంది నిరాశకు లోనవుతారు. అటువంటి సమయాల్లో మనల్ని మనం ఉత్సాహపరుచుకోవడానికి, తిరిగి పుంజుకోవడానికి గొప్ప వ్యక్తుల మాటలు ఎంతో తోడ్పడతాయి. కేవలం తత్వవేత్తలు, రచయితలే కాదు.. క్రీడాకారులు కూడా తమ జీవితానుభవాల నుంచి అద్భుతమైన పాఠాలను నేర్పుతుంటారు. అమెరికన్ ఫుట్‌బాల్ దిగ్గజం టోనీ డోర్సెట్ చెప్పిన మాటలు నేడు ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్నాయి.

**టోనీ డోర్సెట్ విజయ సూక్తి**

"విజయం సాధించాలంటే.. మీరు గట్టిగా పట్టుకోగలిగే ఒక లక్ష్యం, మిమ్మల్ని నిరంతరం ముందుకు నడిపించే ఒక ప్రేరణ, మీలో ఉత్సాహాన్ని నింపే ఒక స్ఫూర్తిని మీరు వెతుక్కోవాలి" అని టోనీ డోర్సెట్ పేర్కొన్నారు. ఈ మాటలు చాలా సరళంగా అనిపించినప్పటికీ, వీటి వెనుక లోతైన అర్థం దాగి ఉంది. కేవలం అదృష్టం మీదో, ప్రతిభ మీదో ఆధారపడి విజయం లభించదని.. పరాజయాలు ఎదురైనప్పుడు కూడా కృంగిపోకుండా నిలబడే శక్తి మనకు ఉండాలని ఆయన ఉద్బోధిస్తున్నారు.

**ప్రతిభ కంటే పట్టుదలే ముఖ్యం**

మనం ఏ రంగంలో ఉన్నా సరే, ప్రతిభ అనేది ఒక ప్రారంభం మాత్రమే. కానీ గమ్యాన్ని చేరుకోవాలంటే మాత్రం నిరంతర శ్రమ అవసరం. ఉద్యోగ రీత్యా వచ్చే సమస్యలు, వ్యక్తిగత నష్టాలు లేదా ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు చాలామంది మధ్యలోనే వదిలేస్తారు. అటువంటి కష్టకాలంలో మనల్ని ముందుకు నడిపించే 'ఇంధనం' ప్రేరణ (Motivation).ఈ ప్రేరణ మన కుటుంబం నుంచి రావచ్చు, మన కలల నుంచి రావచ్చు లేదా మనల్ని తక్కువ అంచనా వేసిన వారికి సమాధానం చెప్పాలనే పట్టుదల నుంచి కూడా రావచ్చు. దేనినైతే మనం బలంగా పట్టుకుంటామో, అదే మనల్ని విజయతీరాలకు చేరుస్తుంది.

**స్ఫూర్తి ఎక్కడి నుంచి లభిస్తుంది?**

స్ఫూర్తి (Inspiration) అనేది మనకు ఒక దిక్సూచిలా పనిచేస్తుంది. మనం ఎందుకు ఈ ప్రయాణాన్ని మొదలుపెట్టామో అది గుర్తుచేస్తుంది. అది మనం చదివిన పుస్తకం కావచ్చు, మన గురువులు కావచ్చు లేదా మనల్ని ప్రోత్సహించే స్నేహితులు కావచ్చు. స్ఫూర్తి పొందిన వ్యక్తి తాత్కాలిక కష్టాలను చూసి భయపడడు. ఎందుకంటే అతడి కళ్ళ ముందు ఒక గొప్ప లక్ష్యం కనిపిస్తూ ఉంటుంది.

**అసలు ఎవరు ఈ టోనీ డోర్సెట్?**

1954, ఏప్రిల్ 7న జన్మించిన టోనీ డోర్సెట్.. అమెరికన్ ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. పిట్స్‌బర్గ్ విశ్వవిద్యాలయం తరపున ఆడుతున్న కాలంలోనే ఆయన అద్భుతమైన రికార్డులను సృష్టించారు. 1976లో ప్రతిష్టాత్మకమైన 'హీస్మాన్ ట్రోఫీ'ని గెలుచుకున్నారు. వృత్తిపరమైన ఫుట్‌బాల్ (NFL) నుంచి 1988లో రిటైర్ అయ్యే సమయానికి, ఆయన చరిత్రలో అత్యధిక యార్డులు పరిగెత్తిన రెండో క్రీడాకారుడిగా నిలిచారు. తన కెరీర్‌లో ఎన్నో గాయాలు, అడ్డంకులు ఎదురైనప్పటికీ.. ఆయన వెనకడుగు వేయలేదు. అందుకే ఆయన మాటలకు అంతటి విలువ ఉంది.

# సక్సెస్ అయ్యే విద్యార్థులు ఫాలో అయ్యే సీక్రెట్ టెక్నిక్స్..

## ఇలా చదివితే టాపర్ అవ్వడం ఖాయం!



కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవడం అనేది చాలాసార్లు చాలా భారంగా అనిపిస్తుంది. కేవలం సిలబస్ పెద్దదనే కాదు, ఎప్పుడూ అప్డేట్‌గా ఉండాలి, ఫోకస్‌గా ఉండాలి, బాగా పెర్ఫార్మ్ చేయాలి అనే ఒత్తిడి కూడా ఉంటుంది. కానీ ఒక విషయం గుర్తుంచుకోండి. సక్సెస్ అంటే ఎక్కువ గంటలు చదవడం కాదు.. సరైన విధంగా చదవడం. అలాగే మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం. ఒత్తిడికి గురి కాకుండా ఎలా చదవాలో డా.దీప్తి, కన్సల్టెంట్ సైకాలజీ, మణిపాల్ హాస్పిటల్, విజయవాడ వెల్లడించారు.

**కష్టపడి కాదు తెలివిగా చదవండి**

అదే నోట్స్‌ని మళ్లీ మళ్లీ చదవడం కంఫర్ట్‌గా అనిపించొచ్చు. కానీ అది ఎక్కువకాలం గుర్తుండదు. దాని బదులు "యాక్టివ్ రీకాల్" (active recall) ట్రై చేయండి. బుక్ మూసేసి, మీరు చదివింది గుర్తు చేసుకునే ప్రయత్నం చేయండి. ఇది కాస్త కష్టంగా అనిపిస్తుంది. కానీ అదే దీని బలం. ఇంకో మంచి పద్ధతి "స్పేస్డ్ రిపిటీషన్" (Spaced Repetition). ఒకేసారి అన్నీ బట్టీ పట్టేయడం కాకుండా, కొంత గ్యాప్ తర్వాత మళ్లీ అదే టాపిక్ ని రివైజ్ చేయండి. ఉదాహరణకు డే 1, డే 3, డే 6 ఇలా. ప్రతి సారి రివైజ్ చేస్తూ ఉంటే, అది ఇంకా ఈజీ అవుతుంది. మెమరీ కూడా ఎక్కువకాలం ఉంటుంది. మీరే టీచర్‌లా అనుకుని కాన్సెప్ట్‌స్‌ని గట్టిగా ఎక్స్‌ప్లెయిన్ చేయడం కూడా మంచిదే. మీరు సింపుల్‌గా వివరించలేకపోతే, ఆ టాపిక్‌లో ఇంకా మీకు క్లారిటీ కావాలన్న మాట.

**చిన్న చిన్న టెక్నిక్స్**

లిస్ట్ ని గుర్తు పెట్టుకోవడానికి mnemonics (నెమోనిక్స్)ని వాడండి. ఐడియాస్‌ని కనెక్ట్ చేసుకోవడానికి మైండ్ మ్యాప్స్ గీయండి.ఫ్యాక్ట్స్(వాస్తవాలని)ని చిన్న చిన్న కథలుగా, లేదంటే, గుర్తుండిపోయే విజువల్స్‌గా మార్చుకోండి.చేతితో రాసుకోవడం అలవాటు చేసుకోండి. అలా రాస్తే మెదడు ఇంకా బాగా గుర్తుంచుకుంటుంది. చివరి వారంలో ప్లాన్ ఉండాలి ఎగ్జామ్ ముందు ఆఖరి వారం కొత్తగా అన్నీ నేర్చుకునే టైమ్ కాదు. అప్పటికే చదివినదాన్ని రివైజ్ చేసుకునే టైమ్.

Day 1: మీరు ఎందులో వీక్ గా ఉన్నారో ఆ విషయాలని గుర్తించండి, ముఖ్యమైన టాపిక్స్ ని రివైజ్ చేయండి

Days 23: వీక్ టాపిక్స్ మీద దృష్టి పెట్టండి. దానికి సంబంధించిన ప్రశ్నల ని ప్రాక్టీస్ చేయండి.

Days 45: ఫుల్ మాక్ టెస్ట్ లని వ్రాయండి. ఇది నిజమైన ఎగ్జామ్ అన్నట్టుగానే భావించండి.

Day 6: తేలికపాటి రివిజన్. అంటే ఫార్ములాలు, షార్ట్ నోట్స్ లాంటివి రివైజ్ చేయండి.

Day 7 సాయంత్రం: కేవలం ఒకసారి పైపైన చూసుకోవడమే... కొత్తగా ఏమీ మొదలు పెట్టొద్దు

మాక్ టెస్ట్ లు (Mock tests) చాలా ముఖ్యం. కానీ వాటిలో చేసిన తప్పులని విశ్లేషించుకుని, వాటిని సరిదిద్దుకోవడమే అసలైన ప్రోగ్రెస్.

సెట్ అయ్యే దినచర్యని తయారు చేసుకోండి

ఎక్కువ గంటలు చదవడం అంటే ప్రొడక్టివ్ అనేది, అన్ని వేళలా కరెక్ట్ కాదు. క్రమం తప్పకుండా చదవడం (Consistency) ముఖ్యం.

చిన్న చిన్న బ్రేక్స్ తో, 45 నిమిషాలు దృష్టి పెట్టి చదవండి.

క్లిష్టమైన సబ్జెక్ట్స్ ని, మీ మైండ్ ఫ్రెష్ గా ఉన్నప్పుడు మాత్రమే చదవండి.

సాయంత్రాలు, రివిజన్ కోసం కేటాయించండి.

78 గంటల నిద్ర తప్పనిసరి. లేదంటే చదివింది గుర్తుండదు.

అలాగే మితంగా తేలికపాటి ఆహారం తీసుకోండి. నీళ్లు బాగా తాగండి. కేవలం కెఫీన్ మీద ఆధారపడకండి.

**ఒత్తిడిని ఎలా తట్టుకోవాలి?**

ఈ విషయం చాలా ముఖ్యం. ఎంత ప్రిపెరేషన్ ఉన్నా, చాలా మంది, ఆందోళన వల్ల సరిగ్గా పెర్ఫార్మ్ చెయ్యలేకపోతారు. అందుకే మనసును నిశ్చలంగా ఉంచుకోవడం నేర్చుకోవాలి. దీనికో మంచి చిట్కా "Square Breathing" method (స్క్వేర్ బ్రీతింగ్ పద్ధతి):

4 counts వరకు శ్వాస తీసుకోండి (inhale చేయండి)

4 counts వరకు శ్వాసని నిలిపి ఉంచండి (hold చేయండి)

4 counts వరకు శ్వాసని వదలండి (exhale చేయండి)

ఇలా నెమ్మదిగా చేయండి. రోజూ 5 సైకిల్స్ చేయండి. ఉదయం లేచిన తర్వాత, రాత్రి పడుకునే ముందు. ఎగ్జామ్ రోజున కూడా హాల్ లోకి వెళ్లే 10 15 నిమిషాల ముందు కూడా ఒక 5 సైకిల్స్ చేస్తే చాలా నిశ్చింతగా ఉంటారు. ఆందోళన ఎక్కువగా అనిపిస్తుంటే "54321(గ్రౌండింగ్ టెక్నిక్)" కూడా బాగా ఉపయోగపడుతుంది.

మీరు చూడగలిగే 5 విషయాలు
మీరు తాకగలిగే 4 విషయాలు
మీరు వినగలిగే 3 శబ్దాలు
మీరు వాసన చూడగలిగే 2 విషయాలు
మీరు రుచి చూడగలిగే 1 విషయం

ఇది మిమ్మల్ని ప్యానిక్ స్టేజ్ నించీ వాస్తవంలోకి తీసుకొస్తుంది.

# పురుషులతో సమానంగా మహిళలు

- సింగరేణిలో డంపర్ ఆపరేటర్లుగా మహిళలు
- 13 దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్లను నడపనున్న మహిళా కార్మికులు
- మహిళా శక్తికి ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆదేశంపై స్పందించిన సింగరేణి
- వివిధ క్లిష్టతర బాధ్యతల నిర్వహణపై ఆసక్తి గల మహిళలకు అవకాశాలు
- త్వరలో జారీ అయ్యే డంపర్ ఆపరేటర్ల నియామకాల్లో మహిళలకు కూడా అవకాశం
- హెవీ మోటార్ వెహికిల్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 13 మంది మహిళా ఉద్యోగులు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యనిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థలో కూడా మహిళా శక్తికి తగు ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలని ఆదేశించడంతో సింగరేణి చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్ల ఆపరేటర్లుగా కొందరు మహిళలకు కంపెనీ అవకాశం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశంపై సింగరేణి యాజమాన్యం మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు, ఓవర్ బర్డెన్ ను గని క్వారీ నుండి ఉపరితలానికి రవాణా చేయడానికి యాజమాన్యం 60 నుంచి 100 టన్నుల భారీ డంపర్లను వినియోగిస్తుంది. సింగరేణిలో గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటివరకు కేవలం మగ ఆపరేటర్లు మాత్రమే ఈ భారీ డంపర్ లను నడుపుతూ వస్తున్నారు. ఎందుకంటే ఈ డంపర్లను నడపడం కొంత కష్టంతో పాటు శారీరక దృఢత్వం, డ్రైవింగ్ నైపుణ్యం అవసరమై ఉంటాయి. పైగా మండే ఎండల్లోనూ భారీ వర్షాలు తీవ్రమైన చలి పరిస్థితులను తట్టుకొని మూడు షిఫ్టుల్లో కూడా డంపర్లు నడపాల్సి ఉంటుంది. ఇంత కష్టతరమైన పనిని పురుష ఆపరేటర్లు మాత్రమే నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే సింగరేణి సంస్థలో ఇటీవల మహిళా ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలని వారి నైపుణ్యాలను శక్తి సామర్థ్యాలను కూడా వినియోగించడానికి తగు ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ గనుల్లో డంపర్ ఆపరేటర్లుగా పని చేయడానికి ఆసక్తి గల మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులను కోరింది. మొదట దాదాపు 35 మంది వరకు ముందుకు వచ్చారు. అయితే భారీ డంపర్లను నడపడానికి వారికి అంతకు ముందే సాధారణ డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు భారీ వాహనాలను నడిపే లైసెన్స్ కూడా అవసరమై ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకున్న యాజమాన్యం సిరిసిల్లలో ఉన్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (ట్రైడ్స్) అనే సంస్థ ద్వారా ఆసక్తి గల మహిళలకు కంపెనీ ఖర్చులతో భారీ వాహనాలపై ఉచిత డ్రైవింగ్ శిక్షణను అందించింది. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 13 మంది మహిళా ఉద్యోగులు తాము డంపర్ ఆపరేటర్లుగా పనిచేయటానికి సంసిద్ధంగా ఉన్నామని కంపెనీకి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వీరందరికీ త్వరలో విడుదలయ్యే డంపర్ ఆపరేటర్ల నియామకల్లో అవకాశం కల్పించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో సింగరేణి సంస్థ కూడా ఆ దిశగా కీలక అడుగులు వేస్తోంది. పురుషులకు మాత్రమే పరిమితమైన కఠినమైన పనుల్లో మహిళలకు సైతం ప్రాధాన్యతనిస్తూ సింగరేణి సంస్థ తొలిసారిగా డంపర్ ఆపరేటర్లుగా మహిళలకు కూడా అవకాశం కల్పించటానికి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ విధంగా అనతి కాలంలోనే సింగరేణి సంస్థలో భారీ డంపర్లపై మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో కనపడే అవకాశం ఉంది. ఈ సందర్భంగా కొందరు మహిళా ఆపరేటర్లు మాట్లాడుతూ భారీ డంపర్లను నడపడం శారీరక కష్టం నైపుణ్యంతో కూడుకున్న పని అని తాము చేయగలమో లేదో అని కొంత భయపడినప్పటికీ స్వయంగా డంపర్లు నడుపుతున్నప్పుడు తాము కూడా ఇటువంటి పనులు చేయగలమన్న ఆత్మవిశ్వాసం కలగిందన్నారు. నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాలతో పాటు రోదసిలోకి వెళ్తున్నారని కనుక గనిలోని డంపర్లను మహిళలు నడపడం అంత కష్టమేమీ కాదని ఇటువంటి మంచి అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి యాజమాన్యానికి తాము ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రివ రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ల ఆదేశాల మేరకు సింగరేణిలో మహిళా శక్తికి తగిన అవకాశాలు కల్పిస్తూ వస్తున్నామని బెల్లంపల్లి ఖైరీగూడ ఓపెన్ కాస్ట్ గనిలో అత్యంత క్లిష్టమైన బ్లాస్టింగ్ విభాగంలో కూడా కేవలం మహిళలను మాత్రమే నియమించగా వారు పురుష ఉద్యోగులతో సమానంగా బ్లాస్టింగ్ ను నిర్వహిస్తున్నారని అలాగే ఇతర విభాగాల్లో కూడా మహిళలు రాణిస్తున్నారని ఒక అధికారి పేర్కొన్నారు. సంస్థ చరిత్రలో తొలిసారిగా మహిళా రెస్క్యూ జట్టును కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇలాగే ఇకపై కూడా వివిధ క్లిష్టతరమైన ఉద్యోగాలలో ఆసక్తి గల మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు ఇవ్వడం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

# ప్రతి విద్యార్థి ప్రభుత్వ బడిలో చేరే విధంగా గ్రామస్తులు సహకరించాలి

**మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్**



**జూలూరుపాడు, మహా:** మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా గ్రామస్తులంతా సహకరించాలని మండల విద్యాశాఖ అధికారి బి జుంకీలాల్ కోరారు. గురువారం విద్య వారోత్సవాలలో భాగంగా నర్సాపురంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎస్ వి కే యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల భవిష్యత్ అభివృద్ధి పై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు విద్యార్థుల విద్య అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ బడిలో చేరే విధంగా గ్రామస్తులంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి, ఏఏపీసి సభ్యులు, గ్రామ పెద్దలు సంఘం చిన్నరాజు, పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో కళాశాల నూతన భవనానికి నిధులు సమకూరుస్తాం

- కళాశాల భూములను పకడ్బందీగా పరిరక్షిస్తాం
- యూజీసీ భవనాన్ని బాలికల హాస్టల్‌గా మార్చేందుకు కృషి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో శ్రీ రామచంద్ర ఆర్ట్స్ సైన్స్ కళాశాల నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులను సమకూరుస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.పూర్ణచంద్ర రావు అధ్యక్షతన గురువారం జరిగిన పూర్వ విద్యార్థి సంఘం సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ కళాశాల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడటంతో పాటు ప్రస్తుత భవనాలను విద్యార్థుల అవసరాలకు తగ్గట్టుగా తరగతి గదులుగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. యూజీసీ నిధులతో నిర్మించిన భవనాన్ని బాలికల హాస్టల్‌గా వినియోగించుకునేలా తక్షణమే అనుమతులు పొందాల్సిన అవసరం ఉందని, భద్రత దృష్ట్యా ప్రహరీ గోడ నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషి కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు సందీప్, కార్యదర్శి కాసుల వెంకట్, సిపిఓ సంజీవరావు, ప్రముఖ న్యాయవాది రబ్, రిటైర్డ్ అధ్యాపకులు డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ ఉమామహేశ్వరరావు, రామస్వామి, పాత్రికేయులు నాగాచారి, లోగాని శ్రీనివాస్, చలపతి రాజు, ప్రభాకర్ రెడ్డి, తారక రామారావు, రాజేష్, రవి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ బోధన

**నేలకొండపల్లి, మహా :** ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ బోధన జరుగుతుందని రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు సూచించారు. మండలంలోని రాయగూడెం ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో గురువారం బడిబాట కార్యక్రమం ను నిర్వహించారు. ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రభుత్వం అందించే పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నారని అన్నారు. మధ్యాహ్నం భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అనేక కార్యక్రమాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రవేట్ మోజులో పడి విద్యార్థుల జీవితాలను నాశనం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరేపల్లి ప్రేమ్కుమార్. కమిటి చైర్మన్ కుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీ.నాగేశ్వరరావు, ఉషశ్రీ, శారద, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాల పరిరక్షణకు పోరాటాలు

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు
- దివంగత జార్జికి ఘన నివాళులు
- వర్ధంతి సభ.. సిఐటియు జెండా ఆవిష్కరణ



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సిఐటియు వ్యవస్థాపకులు జార్జి పోరాటాల స్ఫూర్తితో సింగరేణి సంస్థ పరిరక్షణ కొరకు కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలు మరింత ఉధృతం చేయాల్సిన పరిస్థితి ఉందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు మందా నరసింహారావు అన్నారు. సిఐటియు వ్యవస్థాపకులు జార్జి 35వ వర్ధంతి సందర్భంగా రామవరంలోని జార్జి స్థూపం వద్ద గురువారం వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత సిఐటియు జెండాను సిఐటియు సీనియర్ నాయకులు ఎంఎస్.ప్రకాష్ ఆవిష్కరించిన అనంతరం జార్జ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. సిఐటియు బ్రాంచి అధ్యక్షులు గాజుల రాజారావు అధ్యక్షతన జరిగిన సభా కార్యక్రమంలో మంద నరసింహారావు మాట్లాడారు. సింగరేణిలో సీఐటీయూ కార్మిక సంఘం ఏర్పాటు చేసి కార్మికుల హక్కుల కోసం పెద్ద ఎత్తున పోరాటం చేసిన జార్జి స్ఫూర్తి నేడు చాలా అవసరమని అన్నారు. సింగరేణి సంస్థ తిరోగమన పరిస్థితిలో ఉందని సంస్థను కాపాడుకోవడానికి కార్మికుల హక్కులు రక్షించుకోవడానికి పోరాటాలు తప్పవని తెలిపారు. సింగరేణిలో ప్రస్తుతం కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్న పరిస్థితుల్లో జార్జి చూపిన పోరాట స్ఫూర్తిని తీసుకొని కార్మికుల హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను సింగరేణిలో అమలు చేస్తుంటే సింగరేణిలోని గెలుపొందిన కార్మిక సంఘాలు మౌనంగా ఉండడం కార్మిక లోకానికి నష్టదాయకమన్నారు. అన్ని సంఘాలను కలుపుకొని ఐక్య పోరాటాలు చేసి సింగరేణి సంస్థను కార్మిక చట్టాలు రక్షించుకోవడానికి ఐక్య పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం న్యాయవాది, ఐలూ రాష్ట్ర నాయకులు రమేష్ కుమార్ మక్కాడ్, రిటైర్డ్ సింగరేణి జిఎం పి.శ్రీనివాసరావు, కే హెచ్. ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. జార్జ్ సింగరేణిలో పనిచేస్తున్న కాలంలో బొగ్గు గని కార్మికులకు ఎలాంటి హక్కులు లేవని శ్రమ దోపిడీ చేస్తున్న సమయంలో కార్మికులను ఐక్యం చేసి సిఐటియు యూనియన్ స్థాపించారన్నారు. సుదీర్ఘగా కాలంగా కార్మికుల సమస్యలపై పోరాడిన త్యాగశీలి నిరాడంబరంగా నిస్వార్థంగా పనిచేసిన కార్మిక నేత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షులు గాజుల రాజారావు, వై.వి.రావు, సీనియర్ నాయకులు ఎం.ఎస్. ప్రకాష్, రిటైర్డ్ సింగరేణి జనరల్ మేనేజర్ పి.శ్రీనివాసరావు, నందిపాటి రమేష్, మహ్మద్ అలీ, సూర్యనారాయణ, కొత్తపెల్లి రమేష్ బాబు, ఎలగొండ రఘు, కూరపాటి సమ్మయ్య, గడాల నరసింహారావు, పోశం, పప్పుల వెంకటి, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్.టి.యు.టి.ఎస్ భద్రాద్రి జిల్లా కమిటీ గురువారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుని కలిసి విన్నవించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులు పలు సమస్యలతో సతమతమవుతున్నారని కమిటీ సభ్యుల ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ జి టి ఉపాధ్యాయులు చేసిన సర్వే అమౌంట్ ఇంతవరకు ఇవ్వలేదని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న విధానాల వల్ల ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రాథమిక పాఠశాలలో 10 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉన్న పాఠశాలలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని వెంటనే డీఎస్సీనోటిఫికేషన్ ఇవ్వాలని పేర్కొన్నారు. రెండు సంవత్సరాలు నిండిన ఉపాధ్యాయులకు ట్రాన్స్ఫర్ అవకాశం కల్పించాలని, సిపిఎస్ రద్దుచేసి ఓ పి ఎస్ అమలు పరచాలని తెలిపారు. పెండింగ్ డీఏలను ఇచ్చి పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలు వెంటనే ఇవ్వాలని విద్య కమిషన్ సూచిస్తున్న అసమగ్ర విద్యావిధానాలను అమలు చేయకుండా విద్యా సంబంధించిన విషయాలు మేధావులతోను, ఉపాధ్యాయ సంఘాలతోను చర్చించి సరైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. 317 జీఓ వలన అనేక మంది ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకవెల్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.టి.యు టి.ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు ఎండి.లాల్ మహమ్మద్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి రమణ, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం బూర్గంపాడు మండల నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్షుడిగా బత్తుల వెంకటేశ్వర్లు – కార్యదర్శిగా ఎస్కే అబీద ఏకగ్రీవ ఎన్నిక**




**బూర్గంపహాడ్ మహా :** తెలంగాణ వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం బూర్గంపాడు మండల నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బత్తుల వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా ఎస్కే అబీద ఎన్నికైనట్లు జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ తెలిపారు. మండల సహాయ కార్యదర్శిగా బయ్యారాము, ఉపాధ్యక్షురాలిగా మరియమ్మలను ఎంపిక చేశారు. మొత్తం 13 మంది సభ్యులతో నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సంఘం బలోపేతానికి కృషి చేస్తూ వ్యవసాయ, గ్రామీణ కార్మికుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నమ్మాయి, పద్మ, కనకదుర్గ, కుర్స తిరుపతయ్య, మంగ, మీన, శివ తదితరులు పాల్గొన్నారు

# శభాష్ వెంకన్న...

- ఏఈ అత్యవసర సేవలకు అభినందనలు
- విద్యుత్ సమస్యలకు వెంటనే పరిష్కారం



**కారేపల్లి, మహా:** విద్యుత్ సమస్యలకు వెంటనే పరిష్కారం చూపుతూ అత్యవసర సేవలను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చొరవ చూపుతున్న విద్యుత్ శాఖ కారేపల్లి మండల ఏఈ వెంకన్న పలువురి అభినందనలు పొందుతున్నారు.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళి క కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల కారేపల్లి మండలంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నిర్వహించిన సభల్లో కూడా విద్యుత్ సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండి సమస్యల పరిష్కారానికి ఏఈ చూపుతున్న చొరవ వినియోగదారులను సంతృప్తి పరచడమే కాకుండా ఎమ్మెల్యే కూడా అభినందనలు తెలిపిన సందర్భాలు ఉన్నాయి.. నెల రోజుల క్రితం అప్పా యిగూడెం పంచాయతీ పరిధిలోని వెంకట సాయి నగర్ లో ట్రాన్స్ఫార్మర్ సమస్య తలెత్తగా ఏఈ వెంకన్న స్పందించిన తీరు ఆ కాలనీవాసులను ఎంతగానో ఆకట్టుకుంది. రాత్రంతా పనిచేసి తెల్లవారుజాము వరకు ట్రాన్స్ఫార్మర్ బిగించిన తర్వాతనే ఇంటికి వెళ్లడం ఈ అధికారి అత్యవసర సేవలకు ఎంతటి ప్రాధాన్యతనిస్తున్నారో అర్థమవుతుంది. ఏఈ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యపై వెంటనే స్పందిస్తూ విషయాన్ని పై అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్తూ చేస్తున్న పనులు గత అధికారుల తీరు కంటే భిన్నంగానే కనిపిస్తున్నాయి. కారేపల్లి లోని శివాలయం వీధిలో మిడిల్ పోల్స్ లేక వైర్లు వేలాడబడి చాలా ఏళ్లుగా ఈ సమస్య ఆ ప్రాంతంలో ఇబ్బందిగానే ఉంది. గతంలో అనేకమార్లు గత అధికారులకు చెప్పినా చేస్తామని హామీలు ఇచ్చారు కానీ చేయలేక పోయారు. ఇక్కడి సమస్యను ఏఈ వెంకన్న దృష్టికి నాలుగు రోజుల క్రితం శివాలయం వీధివాసులు తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఏఈ ప్రమాదకరంగా ఉన్న పాత పోల్ ను తొలగించి దాని స్థానంలో కొత్త పోల్ వేయడంతో పాటు మరో మిడిల్ పోల్ కూడా గురువారం వేయించారు. ఈ పనులతో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది. మండలంలో ఇలాంటి ఎన్నో పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపుతూ విద్యుత్ శాఖ ఏఈ వెంకన్న శభాష్ అనిపించుకుంటున్నారు.,

## నీలాద్రి అర్బన్ పార్క్ లో మౌలిక సదుపాయాలు పెంచండి

**ఫారెస్ట్ అధికారులకు చిన్నారుల తల్లిదండ్రుల వినతి**



**సత్తుపల్లి, మహా:** విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో సత్తుపల్లి వేంసూర్ రోడ్ లోని నీలాద్రి అర్బన్ పార్క్ కు జనాల రద్దీ పెరిగింది. స్థానికంగా విహారయాత్రకు అనువైన ప్రాంతం కావడంతో అర్బన్ పార్క్ కు జనాధారణ పొందింది. ఈ నేపథ్యంలో విహారయాత్రకు వచ్చిన సందర్శకుల దగ్గర పార్క్ నిర్వాహకులు పెద్దలకు రూ"20, పిల్లలకు 10 రూపాయల ప్రవేశ రుసుము వసూలు చేస్తున్నప్పటికీ పార్క్ లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని చిన్న పిల్లల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఆట స్థలం నామమాత్రంగా ఏర్పాటు చేశారని, ఆట స్థలంలో ఆట పరికరాలు శిథిలావస్థకు చేరినప్పటికి పార్క్ నిర్వాహకులు అంటి ముట్టనట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. శిథిలావస్థకు చేరిన ఆట పరికరాలపై చిన్నపిల్లలు ఆడుతున్న సమయంలో గాయాల పాలవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పార్క్ ఆవరణలో చిన్నపిల్లల ఆట పరిమాణాన్ని పెంచి అధునాతన ఆట పరికరాలను ఏర్పాటు చేయాలని, చిన్నపిల్లల మానసిక ఉల్లాసానికి ఫారెస్ట్ అధికారులు సహకరించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరారు.

# బీసీ కళ్యాణ మండపంకు నూతన బోర్..

**పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



**మణుగూరు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం గుట్ట మల్లారం గ్రామంలోని బీసీ కళ్యాణ మండపానికి నూతన బోర్ పనులను స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభించారు. గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి, తాగునీటి సదుపాయాల విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో RWS ఏఈ, డీఈ, ఎంపీఓ వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, జిల్లా ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మణుగూరు ఏరియాలో సింగరేణి డైరెక్టర్ పి&పి కొప్పుల వెంకటేశ్వర్లు పర్యటన..

**బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సమిష్టి కృషి చేయాలని సూచన..**



**మణుగూరు, మహా :** సింగరేణి సంస్థ డైరెక్టర్ పిఅండ్ పి కొప్పుల వెంకటేశ్వర్లు గురువారం అధికార పర్యటనలో భాగంగా మణుగూరు ఏరియాను సందర్శించారు. ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తో కలిసి ఓసీ2, ఓసీ4, మణుగూరు ఓసీ గనులను వ్యూ పాయింట్ ద్వారా పరిశీలించారు. అనంతరం ఓసీ 2 గనిలో విపిఆర్ కంపెనీ వర్క్‌షాప్‌లో ఉన్న సాని కంపెనీ డంపర్ల టైర్లు, డ్రమ్స్, పని గంటల విధానం, పర్యవేక్షణ పద్ధతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన పరికరాలను వినియోగిస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం జనరల్ మేనేజర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణాపై దృష్టి సారిస్తూ 202627 సంవత్సరానికి కంపెనీ నిర్దేశించిన 65 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు శ్రామిక శక్తితో పాటు యాంత్రిక శక్తి, అవసరమైన అన్ని వనరులకు యాజమాన్యం ఆమోదం తెలుపుతోందన్నారు. పని గంటలను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటూ యాంత్రిక శక్తిని సమర్థంగా వినియోగించి బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీత, బొగ్గు సరఫరాలో ఆటంకాలు లేకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. మణుగూరు ఏరియాకు నిర్దేశించిన 96.26 లక్షల టన్నుల వార్షిక లక్ష్యాన్ని అధికారులు, కార్మికులు, సూపర్‌వైజర్లు సమిష్టిగా కృషి చేసి చేరుకోవాలని పేర్కొన్నారు. మణుగూరు ఓసీ విస్తరణకు సంబంధించి తక్షణమే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్వోటు జీఎం బి. శ్రీనివాస చారి, పీవో పీకేఓసీ ఎం. శ్రీరమేశ్, ఏరియా ఇంజినీర్ ఆర్. శ్రీనివాస్, ఏజీఎం (ఐఈడీ) సీహెచ్. రాంబాబు, ఏఎస్వో డి. వెంకట రామారావు నాగరమేష్, డీవైసీఎంఓ డా. జ్యోతిర్మయి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తా...

**మండల కాంగ్రెస్ అద్యక్షుడు కక్కిరాల**



**దమ్మపేట ,మహా :** కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం శక్తివంచన లేకుండా శ్రమిస్తానని నూతనంగా నియామకమైన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కక్కిరాల రమేష్ హామీ ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న సమక్షంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులను నియమిస్తూ గురువారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపధ్యంలో అధ్యక్షులు కక్కిరాల రమేష్ మాట్లాడుతూ తన కుటుంబం మొత్తం కాంగ్రెస్ పార్టీ కోసమే పని చేసిందని గుర్తు చేశారు. తన తండ్రి కక్కిరాల ధర్మలింగేశ్వరరావు దమ్మపేట సర్పంచ్ గా దీర్ఘకాలం సేవలు అందించారని , అదే బాటలో తానుకూడా పంచాయతీలో ఉపసర్పంచ్ గా తమవంతు రాజకీయ సేవలను అందించానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తనను గుర్తించి ఇచ్చిన గౌరవ స్థానానికి అన్ని సమయాలలో రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కు ,టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు ,మంత్రులు తుమ్మల ,పొంగులేటి లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు ,కార్యకర్తలు ,అభిమానులు ,గ్రామపెద్దలు కక్కిరాల నియామకం పట్ల అభినందనలు తెలిపారు.

# బిటీపీఎస్ రైల్వే భూసేకరణ పిసా గ్రామసభ వాయిదా..

- గ్రామస్థుల ఏకగ్రీవ తీర్మానం..
- మెరుగైన పరిహారం కోరిన నిర్వాసితులు..



**మణుగూరు, మహా :** మణుగూరు మండలం విప్పల సింగారం గ్రామ పంచాయతీ పరిధిలో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బిటీపీఎస్) నూతన రైల్వే మార్గం కోసం చేపట్టనున్న భూసేకరణకు సంబంధించి గురువారం నిర్వహించాల్సిన పిసా గ్రామసభను గ్రామస్థులు, నిర్వాసిత రైతులు ఏకగ్రీవంగా వాయిదా వేస్తూ తీర్మానం చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పాల్వంచ రాములు మాట్లాడుతూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన తరువాతే భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా తొందరపాటుగా ప్రక్రియలు చేపట్టడం సరికాదన్నారు. పీసా కమిటీ మండల అధ్యక్షుడు సోడే రవి మాట్లాడుతూ గ్రామసభ నిర్వహణపై సరైన సమాచారం ఇవ్వకుండా నిన్న రాత్రి మాత్రమే గ్రామస్థులకు తెలియజేయడం చట్టబద్ధం కాదన్నారు. గ్రామసభ నోటీసును పాత తేదీ 07052026తో పంపించడం పట్ల గ్రామస్థులు ఆశ్చర్యం వ్యక్తం చేశారని తెలిపారు. అన్ని చట్టపరమైన నిబంధనలు, ప్రక్రియలు పాటించిన తర్వాతనే పిసా గ్రామసభ నిర్వహించాలని కోరారు.గ్రామస్థులు, నిర్వాసిత రైతుల అభ్యర్థన మేరకు చట్ట ప్రకారం అన్ని చర్యలు పూర్తి చేసిన అనంతరం మాత్రమే భూసేకరణ ప్రక్రియ చేపట్టాలని కోరుతూ గ్రామసభను వాయిదా వేయాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్లు నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు, నిర్వాసిత కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మణుగూరులో ఎమ్మెల్యే పాయం బిజీబిజీ..

- కేజీబీవీ అభివృద్ధి పనుల సమీక్ష..
- ఐటీడీఏ పనులకు వేగం..
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..



**మణుగూరు, మహా :** పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం మణుగూరులో పలు కార్యక్రమాల్లో పాల్గొని అధికారులతో సమీక్షలు నిర్వహించారు. విద్య, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలపై దృష్టి సారిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు.

**విద్యార్థినుల భవిష్యత్తుకు మెరుగైన వసతులు..**

మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ గిరిజన, విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కేజీబీవీ మౌలిక వసతుల అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పాఠశాల భవనాల నిర్మాణం, హాస్టల్ సదుపాయాలు, తాగునీరు, పారిశుధ్యం, భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఏఈలు ఎం. సత్యశ్రీనివాస్, ఎస్డీ యూసుఫ్ అలీ, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**ఐటీడీఏ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి..**

గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో మరో సమీక్షా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, పినపాక నియోజకవర్గ పరిధిలో ఐటీడీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు త్వరగా అందుబాటులోకి రావాలని పేర్కొన్నారు. రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి అవసరాలపై ప్రతిపాదనలు సిద్ధం చేసి తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుకర్, ఉప ఇంజనీర్ రాజు, సహాయ ఇంజనీర్లు శ్రీకాంత్, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..**

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుమారు రూ.11 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. బూర్గంపాడు మండలానికి చెందిన 18 మంది, పినపాక మండలానికి చెందిన 6 మంది లబ్ధిదారులకు ఈ సహాయాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అత్యవసర సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందన్నారు. అనారోగ్యం, ప్రమాదాలు వంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటోందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సహకార సంఘాలకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి

**చర్లలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో**



**చర్ల మహా :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (కోపరేటివ్ సొసైటీలకు) ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (AIKS) ఆధ్వర్యంలో గురువారం చర్ల జాతీయ రహదారిపై భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న CPI రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర నాయకులు కల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర రైతు సంఘం పిలుపుమేరకు మే 14, 15 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ పిలుపులో భాగంగానే చర్లలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలక మండళ్లను నియమించేందుకు ప్రయత్నించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోని 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గత నెలలో రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నామినేటెడ్ పాలక మండళ్ల నియామక నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి సహకార సంఘంలో 13 మంది సభ్యులను పాలకపార్టీకి చెందిన వారితో నామినేట్ చేయాలని ప్రయత్నించడం రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243ZH ప్రకారం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో CPI, AIKS జిల్లా నాయకులు అద్దగర్ల తాతాజీ, మండల కార్యదర్శి పోతయ్య, సహాయ కార్యదర్శులు, రైతు సంఘం నాయకులు కోటి ముత్యాలరావు, కోడిరెక్కల రాజారావు, చల్లా లక్ష్మీనారాయణ, కట్టం నాగేశ్వరరావు, కుర్నపల్లి సర్పంచ్ శ్యామల తిరుపతిరావు, కొమరం మంగయ్య, చెన్నం సాంబశివరావు, సోడి కన్నయ్య, సోడి లక్ష్మయ్య, మడివి దేవయ్య, ప్రమీల, నాగేష్, దుర్గయ్య, రాజేష్, నరసింహారావు, శ్రీను, రమణయ్య, దుర్గాప్రసాద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన నిరుద్యోగ యువతకు ఐటిడిఏ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాలు

**మే 15న చర్ల ఎంపీడీఓ కార్యాలయంలో కౌన్సెలింగ్**

**చర్ల మహా :** సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ITDA) భద్రాచలం ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు 3 నుంచి 4 నెలల పాటు ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చర్ల మండల ఎంపీడీఓ ఈదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల గిరిజన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా బ్యూటీ థెరపిస్ట్, బ్రైడల్ ఫ్యాషన్ అండ్ ఫోటో మేకప్ ఆర్టిస్ట్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, స్టడీ మెటీరియల్‌తో పాటు శిక్షణ అనంతరం సర్టిఫికేట్ కూడా అందజేయనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు కనీసం 8వ తరగతి, 10వ తరగతి, ఇంటర్ లేదా డిగ్రీ అర్హత కలిగి ఉండాలని, వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన వారు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, విద్యార్హతల పత్రాలతో మే 15న చర్ల మండల ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9347466615, 9447390232 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

# దానవాయిపేటలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం



**చర్ల మహా :** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్ల మండలం దానవాయిపేట మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 'ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదట పాఠశాల ఆవరణలో తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రాజు మాట్లాడుతూ, వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించడమే 'బడి బాట' ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అందుబాటులో ఉన్న అన్ని వసతులను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ సర్పంచ్ తుర్రం రవికుమార్ మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి బిడ్డ బడికి వెళ్లేలా చూడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని, దానవాయిపేట పాఠశాల అభివృద్ధికి గ్రామ పంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి గ్రామంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'విద్య మా హక్కు', 'మీ పిల్లలను మన పాఠశాలలో చేర్పించండి' అనే నినాదాలతో ర్యాలీ సాగింది. 06062027 నుండి 19062026 వరకు జరిగే ఈ కార్యక్రమంలో 1 నుండి 7వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: సర్పంచ్ తుర్రం రవికుమార్, వార్డు మెంబర్ కణితి రజని, ఉపాధ్యాయులు చింతకాయల హరిబాబు, రాజు, సుహాసిని, పీసా మొబలైజర్ రమేష్, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు. పాల్గొన్నారు

# తండ్రి మందలింపుతో యువకుడు ఆత్మహత్య



**చర్ల మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో విషాద ఘటన చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని పద్మశాలి బజార్‌కు చెందిన ఆడెపు నాగేంద్రబాబు కుమారుడు ఆడెపు వినయ్ (18) తండ్రి మందలించాడనే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, ఇటీవల కొన్ని విషయాలపై తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన వినయ్ ఈ దారుణ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఘటన తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. యువకుడి మృతితో పద్మశాలి బజార్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# కుమ్మరుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం

**జిల్లా బిసి సంక్షేమ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి**



**దమ్మపేట ,మహా :** కులవృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న కుమ్మరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని జిల్లా బిసి సంక్షేమ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం మహిళా అధ్యక్షులు మల్లెల ఉషారాణి ,జిల్లా అధ్యక్షులు బాడిశ శంకరరావు నేతృత్వంలో గురువారం జిల్లా బిసి సంక్షేమ అభివృద్ధి అధికారులను కలిసి కుమ్మరులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని మండలాల నుండి కుమ్మరులు తరలివచ్చారు. ముందుగా శాలువాతో గౌరవసత్కారం చేసి పుష్పగుచ్ఛం అందించిన అనంతరం సమస్యలపై చర్చించగా సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోని కుమ్మరుల కులవృత్తి చేసుకునేందుకు అవసరమైన చెరువుమట్టి సేకరణలో ఎదుర్కొంటున్న సమస్యలను , తన దృష్టికి లిఖిత పూర్వకంగా తెలియజేయాలని తెలిపారు. తక్షణమే జిల్లా కలక్టర్ ద్వారా అన్ని మండలాల తహశీల్దార్ లకు కుమ్మర మట్టిని సేకరించేయందుకు అనుమతులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా చేతివృత్తికి అవసరమైన అధునాతన యంత్ర సామాగ్రిని , సబ్సిడీ రుణాలు , ఆధునిక వస్తువుల తయారీ శిక్షణా కేంద్రాలను ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కుండలు కాల్చడానికి అవసరమైన స్థల సేకరణ , రుణాలు , మట్టి పాత్రలకు సరైన గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు గంగాధర శ్రీనివాస్ , అశ్వాపురం మండల నాయకులు గంగాధర కృష్ణ ,సత్యనారాయణ , చర్ల మండల నాయకులు సత్యం ,పాల్వంచ బాధ్యులు నాగేశ్వరరావు ,హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ఎమ్మెల్యే మల్ రెడ్డి లక్ష్యం

- కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మార సురేష్
- మండలంలోని తాగునీటికి 24.90 లక్షల నిధులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (మంచాల) మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రజల సంక్షేమమే ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి లక్ష్యమని, నియోజకవర్గ అభివృద్ధి కొరకు ప్రజల సంక్షేమం ఆయన సంకల్పం గొప్పది అని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మార సురేష్ పేర్కొన్నారు. గురువారం రోజున ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో DMFT నిధుల నుండి మంచాల మండలంలో నూతన బోర్ వెల్, నూతన మోటార్లు మరియు పైప్ లైన్ తదితర తాగునీటి సౌకర్యాల కొరకు 24.90లక్షల రూపాయల నిధులు మంజూరు కావడం జరిగిందని అన్నారు. మండలంలోని నోముల 4.00లక్షలు, లోయపల్లి 5.00లక్షలు, ఆంబోత్ తండా 3.00లక్షలు, ఆరుట్ల 4.00లక్షలు, సత్తి తండా 3.90లక్షలు, ఆగపల్లి 5.00లక్షలు, గ్రామాలకు మంజూరు కావడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని తెలిపారు.

# కందుకూర్ మండలంలో జనగణన!

- సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి
- జనగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి
- ఎన్యుమరేటర్లు సంబంధిత అధికారులకు ఆదేశాలు
- జన గణనకు ప్రజలు సహకరించాలి: జిల్లా కలెక్టర్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలంలో జన గణన 2027లో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి. జన గణన - 2027 లో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే నిర్వహణ, వివరాల నమోదు, డేటా సేకరణ ప్రక్రియలను కలెక్టర్ సి నారాయణ రెడ్డి పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్యుమరేటర్లు ఇండ్ల గణన ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. జనగణన గృహ జాబితా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి ఇంటిని కవర్ చేయాలని, ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఏ ఒక్క కుటుంబం మిగలకుండా అన్ని కుటుంబాల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. సర్వేలో సేకరించే సమాచారం ఖచ్చితంగా నమోదు చేయాలని, డిజిటల్ ఎంట్రీలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో పని చేస్తున్న సిబ్బంది ప్రజలకు జనగణన ప్రాధాన్యతను వివరించి ప్రజల సహకారం పొందాలని తెలిపారు. ఇంటింటి సర్వే ప్రక్రియను అధికారులు నిర్దేశిత గడువులోపు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లు సర్వే చేస్తున్న ఇంటిని దగ్గరుండి కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, కందుకూర్ తహశీల్దార్, ఎంపిడిఓ, సంబంధిత శాఖల అధికారులు, సర్వే సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగం పెంచాలి - ఎంపీడీవో



**కారేపల్లి, మహా :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగం పెరిగేలా లబ్ధిదారులను చైతన్యం చేయాలని సింగరేణి ఇంచార్జీ ఎంపీడీవో మల్లెల రవీంద్రప్రసాద్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ఇందిరమ్మ ఇండ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ మొదటి విడతగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులలో మరింత వేగంతో పెంచేలా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. జూన్ 2వ తేది నుంచి రెండో విడత ఇంద్రమ్మ ఇల్లు మంజూరయ్యే అవకాశం ఉండటం వల్ల, ప్రస్తుతం మంజూరై నిర్మాణం జరుగుతున్న జిల్లా నిర్మాణ పనులను మరింత వేగవంతంగా జరిగేలా చూడాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఈజిఎస్ ఏపీవో కోటేశ్వరరావు, హౌసింగ్ ఏఈలు నాగేంద్ర, స్వప్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ చెక్ పోస్ట్ ను తనిఖీ చేసిన భద్రాద్రి జిల్లా ఎస్పీ





రిజిస్టర్ ను పరిశీలించిన రోహిత్ రాజు ఐపీఎస్

**జూలూరుపాడు, మహా:** జూలూరుపాడు మండల పరిధిలోని వినోబానగర్ వద్ద ఏర్పాటుచేసిన జిల్లా సరిహద్దు పోలీస్ చెక్ పోస్ట్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బక్రీద్ సందర్భంగా అక్రమంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. అనుమానంగా ఉన్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. వాహన తనిఖీకి సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం చెక్ పోస్ట్ లో రిజిస్టర్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సర్కిల్ ఇన్ స్పెక్టర్ శ్రీలక్ష్మి, ఎస్సై బి రవి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ మృతి

**నివాళ్లులర్పించిన నాయకులు**



**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం విశ్వనాధపల్లికి చెందిన గంగాధరణి రవీంద్ర చారి(38) గురువారం మృతి చెందాడు. వెన్నెముక సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మఅతి చెందాడు. రవీంద్ర చారి ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. పేద కుటుంబానికి చెందిన రవీంద్ర చారి అకాల మఅతితో ఆ కుటుంబం దిక్కు తోచని స్థితిలో ఉంది. మృతునికి భార్య సౌజన్య, కుమారుడు సాత్విక్ ఉన్నారు. రవీంద్ర చారి మఅతి విషయం తెలుసుకున్న బిఆరఎస్ జిల్లా నాయకులు ముత్యాల వెంకట అప్పారావు, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నేతలు వెగ్గళం నాగ బ్రహ్మాచారి, తుమ్మోజు రామమూర్తి, ఆటో యూనియన్ నేతలు నివాళులర్పించారు. ఆటో డ్రైవర్ రవి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ నాయకులు కోరారు.

## మున్సిపాలిటీలో పరిపాలన సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలి.!

**అదనపు కలెక్టర్ ను కోరిన చైర్మన్ కౌన్సిలర్లు**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో పరిపాలన సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ను చైర్మన్ కౌన్సిలర్లు కలిశారు. రంగారెడ్డి జిల్లాలోని, ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధికారులపై, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వేదింపులు ఆపాలని, అక్రమ కేసులను నిరోదించాలని, మున్సిపల్ పాలనా వ్యవహారాలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయికి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డితో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్ పర్సన్ ముత్యాల శ్యామల , కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మంగీలాల్ నాయక్ నియామకం



**జూలూరుపాడు, మహా:** మండల పరిధిలోని గంగారం తండా గ్రామానికి చెందిన మాలోత్ మంగీలాల్ నాయక్ పార్టీ మండల అధ్యక్షుడిగా తిరిగి మరోసారి ఎన్నికయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంగీలాల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మరోసారి మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షురాలు దేవి ప్రసన్నకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు బాధ్యతగా పనిచేస్తానని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో అన్ని రంగాల్లో మండలం అభివృద్ధి చెందే విధంగా ముందుకు సాగుతానని తెలిపారు. మండల అధ్యక్షుడిగా రెండవసారి ఎంపికైన మంగీలాల్ కు పలువురు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# డీజీఎం రమేష్‌కు ఏజీఎంగా పదోన్నతి..

**శాలువాతో సత్కరించిన టిబీజీకేఎస్ నాయకులు..**



**మణుగూరు, మహా:** సింగరేణి మణుగూరు ఏరియాలో కార్మిక సంక్షేమం, సంస్థాభివృద్ధికి విశేష సేవలు అందిస్తున్న అధికార ప్రతినిధి సలగల రమేష్ డీజీఎం హోదా నుంచి ఏజీఎంగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఏరియా టిబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం స్థానిక జీఎం కార్యాలయంలో శాలువాతో సత్కరించి, పూల మొక్క అందజేసి, మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మిక సంక్షేమ రంగంలో అపార అనుభవం, క్రమశిక్షణ, నిజాయితీ, పట్టుదలతో సేవలందిస్తున్న సలగల రమేష్‌కు పదోన్నతి రావడం ఆయన పనితీరుకు నిదర్శనమన్నారు. సంస్థపై గౌరవం, విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ కార్మిక వర్గం విశ్వాసాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. 1996లో ఎక్స్‌టర్నల్ ద్వారా మేనేజ్‌మెంట్ ట్రైనీగా బెల్లంపల్లి ఏరియాలో బాధ్యతలు స్వీకరించిన రమేష్, అనంతరం రామగుండం ఏరియాలో వెల్ఫేర్ ఆఫీసర్‌గా సేవలందించారు. 2009లో డీవైపీఎంగా పదోన్నతి పొంది మణుగూరు ఏరియాకు వచ్చి కార్మిక సంక్షేమ రంగంలో పలు మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. కొండాపురం భూగర్భ గనిలో కార్మికులకు ఆర్థిక సహకారం అందించే సొసైటీ ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. 2016లో పర్సనల్ మేనేజర్‌గా పదోన్నతి పొంది కార్పొరేట్ కార్యాలయంలో సేవలందించిన ఆయన, 2019లో రామగుండం1 ఏరియాకు బదిలీపై వెళ్లి సేవలు అందించారు. 2021లో డీజీఎం (పర్సనల్)గా మణుగూరు ఏరియాకు తిరిగి వచ్చి ఏరియా ప్రగతి, కార్మిక సంక్షేమం కోసం విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ కింద ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.

# సింగరేణిలో ఉచిత కరాటే శిక్షణకు శ్రీకారం



**కారేపల్లి, మహా :** సింగరేణి గ్రామంలోని పిల్లలు,యువతలో ఆత్మరక్షణ, క్రమశిక్షణ, శారీరక దఅఢత్వాన్ని పెంపొందించేందుకు ఉచిత కరాటే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి వీరప్రతాప్(టోనీ) తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ వేసవి సెలవులను దఅష్టిలో పెట్టుకొని గ్రామానికి చెందిన బాలబాలికలు, యువతకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కరాటే నేర్చుకోవాలనే ఆసక్తి గల విద్యార్థిని, విద్యార్థులు గ్రామపంచాయతీ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 6 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు ఉన్న పురుషులు, మహిళలు ఈ శిక్షణలో తెలిపారు. కరాటే ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యాలు మెరుగుపడతాయని, ముఖ్యంగా పిల్లలలో ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని సర్పంచ్ టోనీ పేర్కొన్నారు. ఈ శిక్షణ పూర్తిగా ఉచితమని, సింగరేణి గ్రామస్తులకు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# చింతపల్లి గూడెంలో పురాతన శ్రీశ్రీశ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం కూల్చివేత!

- దేవాలయం కూల్చివేతను ఖండించిన ఉక్కుల అశోక్.!
- ఆధ్యాత్మిక విశ్వాసాలను దెబ్బతీసే విభేదాలకు దారితీస్తాయి
- దేవాలయాన్ని పునర్నిందించాలని పట్టుబట్టిన గ్రామస్తులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను దెబ్బతీసే చర్యలు, సమాజంలో విభేదాలకు దారితీస్తాయని, ఈ కూల్చివేతను ఉక్కుల అశోక్ తీవ్రంగా ఖండించారు. రంగారెడ్డి జిల్లా, ఆదిభట్ల సర్కిల్ చింతపల్లిగూడెంలో జరిగిన ఘటనలో, గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను దెబ్బతీసే చర్యలు, సమాజంలో విభేదాలకు దారితీస్తాయని, వెంటనే చింతపల్లి గూడ, ప్రగతి వెంచర్ లోని చెన్నకేశవ ఆలయాన్ని పునర్నిర్మించాలని, దళిత చైతన్య వేదిక (DCV) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఉక్కుల అశోక్ డిమాండ్ చేశారు.

**చరిత్ర కలిగిన శ్రీశ్రీశ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం....**

శంషాబాద్ జోనల్, ఆదిభట్ల సర్కిల్, 54వ డివిజన్ పరిధిలోని, చింతపల్లి గూడ గ్రామంలోని ప్రగతి వెంచర్‌లో ఉన్న సుమారు 100 సంవత్సరాల పురాతన శ్రీశ్రీశ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం కూల్చివేత ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. గ్రామస్థులు ఈ ఆలయాన్ని అత్యంత పవిత్రమైన దేవస్థానంగా భావిస్తూ తరతరాలుగా పూజలు నిర్వహిస్తూ వచ్చారు. కోరిన కోరికలు తీర్చే ఆలయంగా ఈ దేవాలయానికి ప్రత్యేక గుర్తింపు ఉందని గ్రామ పెద్దలు తెలిపారు.

**ప్రైవేట్ వెంచర్ నిర్వాహకుల నిర్వాకం.?**

అయితే వెంచర్ అభివృద్ధి, వ్యాపార అవసరాల పేరుతో కొంతకాలం క్రితం రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆలయాన్ని కూల్చివేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామ ప్రజల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వెంటనే ఆలయాన్ని పునర్నిర్మించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ... "మా గ్రామ దైవాన్ని కూల్చివేయడం బాధాకరం. ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయాన్ని తిరిగి నిర్మించి భక్తుల విశ్వాసాన్ని కాపాడాలి" అని కోరారు.

మహా పత్రిక 07
తెలుగు
శుక్రవారం, హైదరాబాద్ | 15-05-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరి సహకారం అందించాలి

- మెరుగైన విద్యకు ప్రభుత్వ పాఠశాలలు దిక్సూచిగా నిలవాలి
- విద్యార్థుల నమోదు పెంపు పై ప్రత్యేక దృష్టి సారించాలి
- విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా



**రాజేంద్రనగర్ మహా ;** ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల నమోదు పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంతో తెలంగాణా విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి విద్యాభివృద్ధిని ప్రోత్సహించ డానికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విద్యాశాఖ ఎడ్యుకేషన్ విక్ ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం శంషాబాద్ జోన్ పరిధిలోని సాతాంరాయి ప్రభుత్వ పాఠశాలలోవిద్యాభివృద్ధి పై వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమానికిముఖ్య అతిథిగా విద్యాశాఖ కార్యదర్శి యోగిత రాణా, అదనపు కలెక్టర్ కిరణ్మయి తో కలిసి పాల్గొన్నారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడితే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ద్వారా విద్యార్థుల నమోదు ప్రక్రియను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు.విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్పొరేట్కు తగ్గట్టుగా విద్యను అనుభవం ఉన్న ఉపాధ్యాయులు అందిస్తారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల కోసం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించబోతున్నారు. ఉదయం పూట బ్రేక్ ఫాస్ట్ గా పిండి వంటలను ఒకరోజు ఒక్కొక్క విధమైన వంటలను వడ్డించనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల టాయిలెట్లను క్లీన్ చేయడానికి 130కోట్ల బడ్జెట్ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతనికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అన్ని వసతులతో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి సిద్ధంగా ఉన్నాయి. మెరుగైన విద్యకు ప్రభుత్వ పాఠశాలలు దిక్సూచిగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు,మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్, పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జెల్ పల్లి నరేందర్, మాజీ కౌన్సిలర్ సునీత దయానంద్, పార్టీ నాయకులు రామకృష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కాలనీల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

**కమ్యూనిటీ సమావేశంలో కుషాయిగూడ పోలీసుల సూచనలు**






**కుషాయిగూడ, మహా :** కాలనీల్లో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని ఏసీపీ వెంకట్ రెడ్డి కోరారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ కాలనీల అధ్యక్షులతో గురువారం కమ్యూనిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఫోన్ కాల్స్, మెసేజ్లు, ఆన్లైన్ లింకుల ద్వారా జరిగే మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద కాల్స్ వచ్చినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం అవసరమని, కాలనీల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై నిఘా ఉంచాలని సూచించారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు.ఇళ్లలో పనిచేసే మేడ్స్, సర్వెంట్లు, వాచ్మెన్ల పూర్తి వివరాలు స్థానిక పోలీస్ స్టేషన్లో నమోదు చేయించాలని సూచించారు. ప్రస్తుతం నగరంలో చోటుచేసుకుంటున్న కొన్ని ఘటనల నేపథ్యంలో నేపాలీ సర్వెంట్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని తెలిపారు. వేసవి కాలంలో ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, పొరుగువారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. మహిళల భద్రతకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే షీటీమ్స్, పోలీసులను సంప్రదించాలని సూచించారు.సీఐ భాస్కర్రెడ్డి, డీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, రాత్రి వేళల్లో నిఘా పెంపు, వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం పంచుకోవడం వంటి చర్యలు భద్రతకు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు సాయిలు, సుధాకర్రెడ్డి, వెంకన్న, సతీష్, విజయ్, సీడీఈడబ్ల్యూ సిబ్బంది, కాలనీల ప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఫుట్ పాతులను కూల్చారు

- డ్రైనేజీ వ్యవస్థను మరిచారు
- జిహెచ్ఎంసి నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం...
- రోడ్లపై పారుతున్న డ్రైనేజీ..



**రాజేంద్రనగర్ మహా ;** జిహెచ్ఎంసి శంషాబాద్ నిర్లక్ష్యం కారణంగా శంషాబాద్ బస్టాండ్ నుంచి రాల్లగూడ వైపు వెళ్లే రహదారు ప్రాంతాల్లో రోడ్లపై డ్రైనేజీ నీరు పొంగుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వాణిజ్య సముదాయాలు డ్రైనేజీ నీటిని రోడ్డుపై వదులుతున్నారు. రోడ్డుపై డ్రైనేజీ నీరు వదలడంతో శంషాబాద్ నుంచి రాళ్ల గూడ వెళ్లి వాహనదారులు పాదచా రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిహెచ్ఎంసి అధికారులు రోడ్డు వెడల్పులో భాగంగా శంషాబాద్ నుంచి రాల్లగూడ వరకు ఫుట్పాత్లను తొలగించారు. ఫుట్పాతులతోపాటు డ్రైనేజీ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా మారింది. అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థను నెలలు గడుస్తున్న సరి చేయకపోవడంతో ఆ నీరు కాస్త రోడ్డుపై పొంగిపొర్లుతుంది.నిరంతర సమస్య శంషాబాద్ లోని పలు నివాస ప్రాంతాల్లో, ముఖ్యంగా రాల్లగూడ, మధురానగర్, ఆర్బీనగర్ లో ప్రాంతాల్లో డ్రైనేజీ నీరు రోడ్లపైకి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. డ్రైనేజీ నీటితో ప్రజా ఆరోగ్యానికి హానీ కలుగుతుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.రోడ్లపై పొంగుతున్న మురుగునీటి వల్ల దుర్వాసన, దోమల బెడద తీవ్రంగా పెరిగింది. దీని వల్ల స్థానిక ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.అధికారుల నిర్లక్ష్యానికి స్థానికులు ఇబ్బందుల పడి ఆస్పత్రి పాలవుతున్నారు. ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా, అధికారులు పట్టించుకోవడం లేదని, బాధ్యతను ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ట్రాఫిక్ అంతరాయంతో రోడ్లపై నీరు నిలవడం వల్ల ట్రాఫిక్ జామ్లు ఏర్పడి, ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు

- నీట్ పరీక్ష పేపర్ లీకేజీ సిగ్గుచేటు
- బండి భాగీరథ్ ను కఠినంగా శిక్షించాలి
- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు



**రాజేంద్రనగర్ మహా ;** లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్లక్ష్యానికి గురిచేయడం అత్యంత దుర్మార్గమని పానుగంటి పర్వతాలు అన్నారు. శంషాబాద్ సిపిఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు నీట్ పరీక్ష లీకేజీ పై మండిపడ్డారు.సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ, అవినీతి పరీక్షల నిర్వహణలో జరిగిన ఘోర వైఫల్యాలకు నిరసనగా కేంద్ర ప్రభుత్వం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ను వెంటనే రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్లక్ష్యానికి గురిచేయడం అత్యంత దుర్మార్గమని అన్నారు. పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, బాధ్యత లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో పేపర్ లీకేజీలు జరగడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, విద్యార్థులకు న్యాయం చేయాలి. బండి భగీరథ్ 17 ఏళ్ల మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించే అత్యాచార ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. నిందితులను సమాజం విరిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కొడుకు చేసిన నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి తండ్రి బండి సంజయ్ తాను కేంద్ర మంత్రిని అని మరిచిపోయి వివిధ సభలలో ప్రశ్నించిన వాళ్లను బెదిరించే పద్ధతిలో మాట్లాడటం హేయమైన చర్య అన్నారు తండ్రిగా ఫెయిల్ అయిన బండి సంజయ్ కనీసం మంత్రిగా నైనా చట్టాలను ప్రజాస్వామ్యాన్ని గౌరవించి తన కొడుకు పోలీసులకు అప్పగించాలి. కొడుకును కాపాడడానికి తన మంత్రి పదవిని అడ్డం పెట్టుకొని రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నాడని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆర్ యాదగిరి, మండల కార్యదర్శి నర్రగిరి, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించండి



**యాదాద్రి భువనగిరి, మహా:** ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నందున విద్యార్థులను బడిలో చేర్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం అనంతారం ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి మెగా PTM) ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులను చేర్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. విద్యా వారోత్సవాలలో భాగంగా పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను,100 శాతం హాజరు నమోదు చేసిన విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు.ఇదే కార్యక్రమంలో విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ పి.మదన్మోహన్ బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లి లో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి(మెగా PTM) ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.విద్యార్థుల కోసం ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అల్పాహారాన్ని అందించడంతో పాటు, ఇంటర్మీడియట్ వరకు ఉచిత మధ్యాహ్న భోజనం అందించనున్నదని ఆయన అన్నారు.జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ కందుల సత్యనారాయణ ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట ఉన్నత పాఠశాలలో పాల్గొని ఉత్తమ ఫలితాలు వస్తున్న ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులు,ప్రజా ప్రతినిధులను కోరారు.ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ,వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మెగా PTM లలో అధికారులు,ప్రజా ప్రతినిధులు,జిల్లా సెక్టోరియల్ అధికారులు పెసరు లింగారెడ్డి,షేక్ జానీ అఫ్జన్,సి.హెచ్.రాధ,మండల విద్యాధికారులు,ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పలు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలి....
- సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కీలక సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. రాజేంద్రనగర్ జోన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే ప్రకాష్గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా జిహెచ్ఎంసి వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖలకు సంబంధించిన పెండింగ్ పనులపై చర్చించారు.ఎమ్మెల్యే మాట్లాడుతునియోజకవర్గంలోని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రకాష్గౌడ్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో మౌలిక సదుపాయాల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఈ సమావేశంలో స్థానిక సమస్యల పరిష్కారానికి స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశారు. కార్యక్రమంలో పలు శాఖలకు సంబంధించిన అధికారులు, జిహెచ్ఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఆహార కల్తీని అరికట్టాలి

**జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



**యాదాద్రి భువనగిరి, మహా:** జిల్లాలో ఆహార కల్తీని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.గురువారం తన ఛాంబర్ లో ఆహార భద్రతపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధ్యక్షతన జిల్లా ఆహార పరిరక్షణడెసిగ్నేటెడ్ ఆఫీసర్ (DO) పి. స్వాతి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ప్రజారోగ్యం, ఆహార నాణ్యత మరియు కల్తీ నివారణ పై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు మరియు హాస్టళ్లలో ఆహారాన్ని వండే సిబ్బందికి (Food Handlers) తక్షణమే ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వంట చేసే వారు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యార్థులకు సురక్షితమైన ఆహారం అందుతుందని ఆయన పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పంపిణీ చేసే గుడ్లు మరియు ఇతర ముడి సరుకుల నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గుడ్ల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రస్తుతం ప్రధాన సమస్యగా మారిన పాల కల్తీపై ఆహార భద్రత అధికారులు, పోలీస్ అధికారులతో కలిసి జాయింట్ రైడ్స్ (ఉమ్మడి దాడులు) నిర్వహించి, కల్తీకి పాల్పడే వారిపై కఠినమైన కేసులు నమోదు చేయాలని సూచించారు.చిరు మరియు మీడియం స్కేల్ వ్యాపారులు ఎఫ్ఎస్ఎస్ఐ లైసెన్స్ పొందాలని మరియు వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని మరియు కూరగాయలు మరియు పండ్ల సాగుకై పెస్టిసైడ్స్ వాడకం తగ్గించాలని తెలిపారు.ఆహార భద్రత నియమిత అధికారి పి. స్వాతి మాట్లాడుతూ.. జిల్లాలో ఆహార కల్తీని అరికట్టేందుకు తమ బృందం నిరంతరం శ్రమిస్తుందని, నిబంధనలు పాటించని వ్యాపారులపై భారీ జరిమానాలు విధిస్తామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మనోహర్, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి నరసింహా రావు, భువనగిరి రూరల్ సిఐ చంద్రబాబు మరియు పలు శాఖల జిల్లా అధికారులు మరియు సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల నిర్లక్ష్య వైఖరి వీడాలి..
- కుమారుడి కేసుకు నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ ఎంపీ పదవికి రాజీనామా చేయాలి..
- సిర్పంగి స్వామి, సిపిఎం మండల కార్యదర్శి



**వలిగొండ, మహా:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ పై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు ఇంతవరకు అరెస్ట్ చేయకపోవడం ఏమిటని ఇలాంటి కేసులో సామాన్యులకు ఒక న్యాయం!! కేంద్ర మంత్రి కొడుకు కు ఒక న్యాయమా!!! అని ప్రభుత్వాన్ని పోలీసులను ప్రశ్నించారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పోలీసు యంత్రాంగం తమ నిర్లక్ష్యం విడాలని డిమాండ్ చేశారు.. గురువారం వలిగొండ మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు, బండి భగీరథ బాలికను వేధించి బలవంతంగా మద్యం తాగించి అత్యాచారం చేసిన కేసులో పోలీసులు అనుసరిస్తున్న తీరు సరి అయింది కాదన్నారు. నిందితుడు గతంలో సైతం విద్యాసంస్థల్లో ర్యాగింగ్ చేయడం విద్యార్థులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం వంటి అనేక ఆరోపణలు ఎదుర్కొన్న సంగతి బిజెపి నాయకులు మరిచిపోరాదన్నారు.నిరంతరం దేశం కోసం ధర్మం కోసం అని మాట్లాడే బిజెపి నాయకులు కేంద్రమంత్రి కుమారుడి ఘటనపై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులకు ఒక న్యాయం పేదలకు ఒక న్యాయము ఉంటుందా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు పోలీస్ యంత్రాంగం తమ నిర్లక్ష్యాన్ని విడాలని డిమాండ్ చేశారు దేశంలో చట్టబద్ధ, రాజ్యాంగబద్ధ సంస్థలను బీజేపీ నిర్వీర్యం చేస్తుందని చెప్పడానికి ఇదే ఉదాహరణ అని అన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యనిపై చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీలు సామాజిక ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తుంటే విషయాన్ని పక్కదోవ పట్టించడానికి దేశం గురించి ధర్మం గురించి నీతులు వల్లించడం సిగ్గుమాలిన చర్య అన్నారు, వెంటనే తన కొడుకు కేసు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి పదవికి బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వన ఉపేందర్,మండల కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు వెంకటేశం, మండల కమిటీ సభ్యులు దుబ్బ లింగం,బూడిద మనమ్మ, వలిగొండ పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ,నాయకులు శీలం ఇందిర,కొండూరు సత్తయ్య, కొమ్ము స్వామి,మైసొల్ల నరేందర్, గోపగాని కుమార్,బూడిద సైదులు, బసాని సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు

# ప్రతి కుటుంబం వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలి

**అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



**యాదాద్రి భువనగిరి, మహా:** జనగణన-2027 గృహగణన కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.గురువారం అనంతారం గ్రామంలో సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న గృహగణన సర్వేను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి వివరాల నమోదు ప్రక్రియ, హౌస్ లిస్టింగ్ విధానం, కుటుంబాల వివరాల సేకరణ తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన 2027 అత్యంత కీలకమైందని తెలిపారు. సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్ల జనగణన నమోదు చేసేటప్పుడు తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. అందువల్ల ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివరాలను సరైన విధంగా అందించి సహకరించాలని కోరారు. అధికారులు, ప్రజల సమన్వయంతో జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారుఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లులను తనిఖీ చేసిన ఎంపీడీవో జలంధర్ రెడ్డి

**వలిగొండ, మహా :** మార్కెట్లో ధాన్యం కొనుగోలు వేగవంతం కాకపోవడ పై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం వలిగొండ ఎంపీడీవో జలంధర్ రెడ్డి మండలంలోనివివిధ రైస్ మిల్లులను తనిఖీ చేశారు రోజుకు ఎన్ని లారీలు అన్లోడ్ అవుతున్నాయి అని తెలుసుకున్నారు ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు

## రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు ఆధునిక సాగుతోనే అధిక లాభాలు

**పాలకుర్తి:** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలం పుట్నూరు గ్రామంలో నేల ఆరోగ్యంగా ఉంటేనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని,రైతులు ఆధునిక సాగు పద్ధతుల వైపు మళ్లాలని పుట్నూరు సర్పంచ్ తోట ప్రశాంత్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోగురువారం పుట్నూరు కూడలిలో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జగిత్యాల పొలాస వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ టి. ఎల్లా గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి,పంట మార్పిడి వైవిధ్యీకరణ చేపట్టాలని సూచించారు.

# లారీ లోడింగ్, అన్లోడింగ్ విషయంలో అశ్రద్ధ వద్దు

**శ్రీరామ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసిన డీసీపీ**



**మంచిర్యాల, మహా :** లారీల లోడింగ్, అన్లోడింగ్ విషయంలో అమాలీలు అశ్రద్ధ వహించరాదని మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ అన్నారు. గురువారం లక్షెట్టిపేట శ్రీరామ రైస్ మిల్లు ను తాసిల్దార్ మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, సీఐ రమణమూర్తి, ఎస్సై సురేష్ ల ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత, లారీల ద్వారా ధాన్యం రవాణా ప్రక్రియలో ఎలాంటి అశ్రద్ధ ఉండరాదని వెల్లడించారు. రైతులకు,లారీ లోడింగ్ విషయంలో ఎలాంటి జాప్యాలు లేకుండా యాజమాన్యాలు చొరవ చూపాలని చెప్పారు.

## ఈనెల 16న తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

**భువనగిరి, మహా :** ఈనెల 16న హైదరాబాదులో బషీర్బాగ్ సూరవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా టియువి అధ్యక్షులు సంగిశెట్టి జనార్ధన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నారు జిల్లాలో ఉన్నటువంటి ప్రతి ఉద్యమకారుడు సమావేశం హాజరు కావాలని ఉద్యమకారులకు రావలసిన న్యాయమైన డిమాండ్ల కోసం ప్రభుత్వం పై ఒత్తిడి చేద్దామని ఆయన అన్నారు

## వలిగొండలో వాహనాలు తనిఖీ చేసిన ఎస్ఐ యుగంధర్ గౌడ్

**వలిగొండ, మహా :** వలిగొండ మండల కేంద్రంలో గురువారం ఎస్సై యుగంధర్ గౌడ్ వాహనాలు తనిఖీ చేశారు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా లైసెన్సు బండి కాగితాలు హెల్మెట్ ధరించాలని కౌన్సిలింగ్ ఇచ్చారు వాహనాలు నడిపేటప్పుడు అతివేగంగా నడపవద్దని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు

# సింగరేణి కంపెనీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

- కొత్త గనులు, ఉద్యోగాల కలపనే లక్ష్యం
- చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**మందమర్రి, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీకి పూర్వ వైభవం తీసుకొస్తానని చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం మందమర్రి ఏరియా కే.కే 5 గనిపై రక్షణ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో కొత్త బొగ్గు గనులు తీసుకురావడం కొరకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నం చేస్తుందని అన్నారు. కొత్తగా గనుల ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగాల కల్పన జరుగుతుందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కోల్ బ్లాక్ టెండర్లలో సింగరేణి సంస్థ పాల్గొనేలా చర్యలు తీసుకుంటోందన్నారు.కొత్త గనులు ప్రారంభమైతే కొత్త ఉద్యోగాలు వస్తాయని అందులో భాగంగా ఆర్కేపీ ఓపెన్కాస్ట్ ఫేజ్ 2 ప్రాజెక్టు ద్వారా సుమారు 5 వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. అందుకొరకు ప్రజాభిప్రాయ సేకరణ జరిగిందన్నారు. ఫారెస్ట్ అనుమతులు వచ్చిన వెంటనే గనిని ప్రారంభిస్తారని వెల్లడించారు. ప్రేక్స్పై ఇన్కమ్ ట్యాక్స్ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాల పెంపు అంశాన్ని కూడ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఆయన స్పష్టం చేశారు. త్వరలో ఆ సమస్య పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం మే 1 కార్మికుల దినోత్సవం సందర్భంగా శ్రమశక్తి అవార్డును రాష్ట్ర ప్రభుత్వం ద్వారా స్వీకరించిన పుల్లూరి లక్ష్మణ్, ఏడుకోల పవన్ లను ఆయన కార్మికులు, అధికారుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. అనంతరం మందమర్రి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ, గని అధికారులు, ఐ ఎన్ టి యు సి ఏరియా ఉపాధ్యక్షులు దేవి భూమయ్య, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు కాంపల్లి సమ్మయ్య, మందమర్రి తాసిల్దార్ సతీష్కుమార్, కే.కే. గ్రూపు ఏజెంట్ రాంబాబు, గని మేనేజర్ శంభూనాథ్ పాండే, ఏఐటీయూసీ నాయకులు కంది శ్రీనివాస్, ఇతర కార్మిక సంఘాల నాయకులు, అధికారులు భూగర్భ గనులలో పని స్థలాలను పరిశీలించారు.

# ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు**



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు అన్నారు. గురువారం జిల్లాలోని కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేయడానికి గోదాములుగా మార్చిన జైపూర్ మండలం రామారావుపేటలో గల సుముఖ డిఫాల్టర్ రైస్ మిల్లు, హాజీపూర్ మండలం నర్సింగాపూర్ లో గల రాజరాజేశ్వరి డిఫాల్టర్ రైస్ మిల్లులను కార్మిక శాఖ సహాయ కమిషనర్ క్రాంతి తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గ్రామంలో రైతులు పండించిన పంటను కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేసిందని అన్నారు. ఆ కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వివిధ రైస్ మిల్లర్లకు సరఫరా అవుతుందని వెల్లడించారు. ఈ క్రమంలో జిల్లాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి కేటాయించిన రైస్ మిల్లులకు, గోదాములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. రైస్ మిల్లులు, గోదాములకు తరలించబడిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని, అవసరమైతే హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఆధ్వర్యంలో హమాలీలను ఏర్పాటు చేయడం జరిగిందని, వరి ధాన్యం దిగుమతి త్వరితగతిన చేపట్టాలని తెలిపారు. రోజుకు కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేయాలని ఆదేశించారు. జిల్లాలో రైతులు ఇబ్బందులు పడకుండా వరి కొనుగోలు, దిగుమతి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.







## కాళ్లకు గాయాలు.. ఎన్నో జ్ఞాపకాలు..

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం నటిస్తున్న తాజా చిత్రం 'మైసా'. ఈ సినిమా షూటింగ్ అనుభవాల గురించి ఒక ఎమోషనల్ పోస్ట్ ను షేర్ చేసింది. రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 'మైసా' సినిమా సెట్స్‌లో గడిపిన క్షణాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనైంది. ప్రస్తుతం ఆమె చేసిన పోస్ట్ వైరల్ అవుతుంది.ఈ సినిమా ప్రయాణం తన జీవితంలో ఎంతో ప్రత్యేకమని, ముఖ్యంగా ఈ పాత్ర తనను మానసికంగా ఎంతో ప్రభావితం చేసిందని ఆమె ఇన్ స్టాలో రాసుకొచ్చింది. షూటింగ్ ముగిసిన తర్వాత చిత్ర బృందంతో గడిపిన సమయాన్ని, అక్కడి జ్ఞాపకాలను మిస్ అవుతున్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. కొన్ని ఫోటోలను కూడా షేర్ చేసింది.అందులో ఆమె షూటింగ్ లోకేషన్‌లో చాలా సహజంగా కనిపిస్తోంది. ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. రష్మిక తన నటనతో ఈ పాత్రకు ప్రాణం పోసింది. ఆమె డెడికేషన్ చూసి చిత్ర యూనిట్ కూడా ప్రశంసల వర్షం కురిపిస్తోంది. ఈ సినిమా యాక్షన్ సీక్వెన్స్ కోసం కఠినమైన శిక్షణ తీసుకున్నానని గుర్తు చేసుకుంది రష్మిక. ఆ సమయంలో తన మోకాళ్లకు గాయాలైనా పట్టు వదలకుండా పోరాడడం తనలోని ఆత్మ విశ్వాసాన్ని నింపిందని పేర్కొంది. ఉదయాన్నే నిద్ర లేవడం నుంచి అక్కడిస్థానిక వంటకాలను ఆస్వాదించడం వరకు ప్రతి క్షణం ఒక మధుర జ్ఞాపకమని వివరించారు. గాయాలైనప్పటికీ ఏమాత్రం విరామం తీసుకోకుండా షూటింగ్ చేసిందట.

## బ్లాక్ కలర్ డ్రెస్‌లో అదిరిపోయిన మృణాల్

టాలీవుడ్ క్రేజీ బ్యూటీ మృణాల్ ఠాకూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఈ చిన్నది ప్రస్తుతం హిందీ, తెలుగు సినిమాల్లో నటిస్తూ, వరస సినిమాలతో దూసుకెళ్తుంది, తన నటనతో మంచి గుర్తింపు సంపాదించుకుంటుంది.ఇక ఈ అమ్మడు ఆగస్టు 1, 1992లో మహారాష్ట్రాలో జన్మించింది, బుల్లితెరపై సీరియల్స్‌లో నటించి ఈ బ్యూటీ తన కెరీర్ స్టార్ చేసింది.. తర్వాత లవ్ సోనియా అనే సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. అలా సిల్వర్ స్క్రీన్ పై అడుగు పెట్టి ప్రస్తుతం వరస సినిమాలతో దూసుకెళ్తుంది. ముఖ్యంగా ఈ ముద్దుగుమ్మ దుల్కర్ సల్మాన్ సరసన సీతా రామం మూవీలో నటించి, తన నటనతో తెలుగు అభిమానుల మనసు దోచుకుంది. ఈ మూవీలో సీత పాత్రలో నటించి మంచి గుర్తింపు సంపాదించుకుంది. దీని తర్వాత తెలుగు స్టార్ హీరోల సరసన అవకాశాలు అందుకుంటూ ఫుల్ బిజీ అయిపోయింది. ఇక ఈ మధ్య ఈ అందాల ముద్దుగుమ్మ ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తన అందంతో అందరినీ ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ , బ్లాక్ కలర్ స్టైలిష్ డ్రెస్‌లో ఉన్న ఫొటోలు సోషల్ మీడియలో షేర్ చేసింది. ఇవి నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

## ఏం అందం గురూ..

బ్యూటీ అదితి రావు హైదరి గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ బ్యూటీకి సినిమా అవకాశాలు ఎక్కువగా లేకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఈ బ్యూటీ 2006లో మలయాళం ప్రజాపతి సినిమాలో నటించింది. తర్వాత హిందీలో యే సాలి జిందగీ అనే మూవీలో నటించి మంచి గుర్తింపు సంపాదించుకుంది. ముఖ్యంగా తెలుగులో సమ్మోహనం మూవీలో సుధీర్ బాబు సరసన నటించి మెప్పించింది. ఇందులో అచ్చ తెలుగు అమ్మాయిలా కనిపించి ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. అంతే కాకుండా తెలుగులో చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. ముఖ్యంగా వి, మహా సముద్రం లాంటి సినిమాల్లో నటించింది. సినిమాలే కాకుండా వెబ్ సిరీస్ చేస్తూ కూడా ఫుల్ బిజీగా గడిపేస్తుంది. ఈ బ్యూటీకి సినిమా అవకాశాలు తక్కువే కానీ ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. అదితిరావు హైదరి 2024 మార్చిలో టాలీవుడ్ నటుడు సిద్ధార్థ్‌ను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. పెళ్లి తర్వాత ఈ బ్యూటీ మరింత యాక్టివ్ అయ్యింది. తాజాగా ఈ ముద్దుగుమ్మ తన ఇన్ స్టాలో స్టైలిష్ లుక్‌లో ఉన్న ఫొటోస్ షేర్ చేసింది. ఇందులో ఈ ముద్దుగుమ్మ ఫొటోస్‌కు ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. దీంతో ఈ పిక్స్ చూసిన వారందరూ, బ్యూటిఫుల్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com